Postail Licence No. L/KNL/3-19(D). 2016 - 2018

# ఉత్తేజిత దినపత్రిక

ఎడిటర్ : చంద్ర శేఖర్ యం

Published from Kurnool ---- Circulated by Andhrapradesh, Telangana & New Delhi

సంపుటి :04 సంచిక : 317 పేజీలు 8 వెల : 5 ఆదివారం 17 మే 2026

విలేకరులు కావలెను

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం

వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ఆదరణ పొందుతున్న ఉత్తేజిత తెలుగు దినపత్రికకు మరియు UV9 కేబుల్ Tv చానల్ కు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ ల నందు పనిచేయుటకు జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు నియోకవర్గాల వారిగా ఆర్.సి.ఇన్‌చార్జిలు మండలాల వారిగా విలేకరులు కావలెను

ఉత్తేజిత దినపత్రిక UV9

Contact : 94401 40418, 63038 17489



## ఐసిసి టెర్రరిస్ట్ అబూ బిలాల్ అల్ మినుకీ హతం

నైజీరియాతో కలసి అంతమొందించిన అమెరికా

మోస్ట్‌వాంటెడ్ ఉగ్రవాదిని అంతమొందించినట్లు ట్రంప్ ప్రకటన

2లో..



## మన సంస్కృతీసంప్రదాయాలు
# చిరస్మరణీయమని కితాబు

2లో..

- నెదర్లాండ్స్ పర్యనటలో ప్రధాని మోడీ
- మోడీకి ప్రవాసభారతీయులు ఘన స్వాగతం
- సెమి కండక్టర్ల విషయలంఓ భారత్ దూసుకెళ్తోందని వెల్లడి
- యూనికార్న్ సంస్థలు వందకు చేరాయని ప్రకటన

ప్రవాస భారతీయులతో కరచాలనం, మాటామంతీ నిర్వహించారు. నెదర్లాండ్స్ నాయకత్వంతో ఎప్పుడు మాట్లాడినా ప్రవాస భారతీయులను ఎంతో ప్రశంసించేవారని ప్రధాని గుర్తు చేసుకున్నారు. హేగ్ నగరం భారతీయ స్నేహానికి సజీవ చిహ్నంగా మారిందన్నారు. కాలం మారినా.. భారతీయ సంస్కృతి మారలేదని కొనియాడారు.




# పేరికం లేని సమాజామే లక్ష్యం

- స్వచ్ఛత మన జీవితోల భాగం కావాలి
- ఎక్కువమంది పిల్లలే మనకు సంపద
- స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో సీఎం చంద్రబాబు



2లో..

స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రతో స్వచ్ఛత వైపు అడుగులు వేస్తున్నాం. స్వచ్ఛమైన ఆలోచనలు చేయాలి. అదే మనకు మంచి చేస్తుంది. అలవాట్లు మారాలి.. తద్వారా సమాజం మారుతుంది. గత 16 నెలలుగా స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర నిర్వహిస్తున్నాం. వ్యర్థాల నుంచి కరెంట్ ఉత్పత్తి చేస్తున్నాం. ఒకప్పుడు నా పాదయాత్రల సమయంలో చెత్తే ఎక్కువ కనిపించేది.



2లో..

## ప్లాస్టిక్ వాడకంతో అనర్థాలు

- ప్రజలు ప్లాస్టిక్‌కు దూరంగా ఉండాలి
- స్వాచ్ఛాంధ్ర కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర



2లో..

## పెట్రో ధరల పెంపు.. ప్రజల నెత్తిన పిడుగు

ఈ నిర్ణయంతో అనేక రంగాలపై వ్యతిరేక ప్రభావం

ధరల పెంపు దారుణం అంటూ ఎక్స్‌లో సిఎం రేవంత్ పోస్ట్

# నేడు బిజెపి డప్పుడు కళాకారుల ప్రదర్శన

**పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ వెల్లడి**




విజయవాడ: దళితుల ఆత్మగౌరవ గుండె చప్పుడు పేరుతో బీజేపీ వినూత్న కార్యక్రమం చేపట్టిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. మే 17 ఆదివారం సాయంత్రం అంబేద్కర్ విగ్రహం సాక్షిగా డప్పు కళాకారులతో భారీ ప్రదర్శన ఉంటుందని తెలిపారు. డప్పు ద్వారా ఆధ్యాత్మిక, సంగీత, ప్రచార కార్యక్రమాలు జరుగుతాయన్నారు. డప్పు వాయిద్యానికే జీవితాలను అంకితం చేసిన వారు ఉన్నారని గుర్తుచేశారు. మేల్కొలిపే ఈ డప్పును ఓ దళితుడు మోగిస్తారని.. ఆ తరువాత ఇతర వాయిద్యాలు ప్రారంభమవుతాయని చెప్పారు. బీజేపీ ఎస్సీ మోర్చా అధ్యక్షులు పనతాల సురేశ్ ఆధ్వర్యంలో డప్పు కళాకారుల కోసం ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వారి బతుకుల్లో వెలుగులు ఇచ్చేలా వారి సంక్షేమం కోసం బీజేపీ కృషి చేస్తోందన్నారు.

భారత రాజ్యాంగం ద్వారా అందరకీ సమాన ప్రాధాన్యం ఇచ్చిన అంబేద్కర్ నడయాడిన ప్రాంతాలను ప్రధాని మోదీ అభివృద్ధి చేశారని మాధవ్ చెప్పారు. విజయవాడలో అతిపెద్ద అంబేద్కర్ విగ్రహాన్ని మాజీ సీఎం జగన్ ఏర్పాటు చేశారని అందరూ అనుకుంటారని.. అది నిజం కాదని స్పష్టం చేశారు. మోదీ ప్రభుత్వం రూ.430 కోట్లు కేటాయించి నిర్మాణం చేసిందని తెలిపారు. అంబేద్కర్ ఆశయాలు ప్రజల్లోకి వెళ్లేలా రేపు(ఆదివారం) డప్పు కళాకారుల ప్రదర్శనలు ఉంటాయన్నారు. 'చదవండి.. సమీకరించండి.. పోరాడండి అని అంబేద్కర్ చెప్పారు. చదువు ద్వారా సమాజంలో గుర్తింపు ఉంటుందని చెప్పారు' అని గుర్తుచేశారు. రేపు పెద్ద ఎత్తున జరిగే ఈ ప్రదర్శనలో మంత్రి సత్యకుమార్, కూటమి నాయకులు పాల్గొంటారని మాధవ్ తెలిపారు. డప్పు కళాకారులకు చేయూతనివ్వాలని.. ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. అన్ని కులాల వారికి ఆలయాల్లో సమాన ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. దేవాలయ వ్యవస్థలో అన్నివర్గాల వారి పాత్ర ఉంటుందని తెలిపారు. డప్పు కళాకారులు ప్రతి ఉత్సవంలో కీలకంగా పని చేస్తారన్నారు.



## ఏపీ ఐసెట్-2026 ఫలితాల విడుదల

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించిన ఏపీ ఐసెట్-2026 ఫలితాలను మంత్రి నారా లోకేష్ విడుదల చేశారు. ఈ సందర్భంగా పరీక్షలో మొత్తం 91.41 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు వెల్లడించారు. ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఈ పరీక్షకు రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులు హాజరయ్యారు. ఫలితాలను అధికారిక వెబ్‌సైట్ లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. విద్యార్థులు తమ హాల్‌టికెట్ నంబర్ ద్వారా ఫలితాలను చెక్ చేసుకోవచ్చని సూచించారు.



2లో..

## బండి భగీరథ్‌పై లుకౌట్ నోటీసులు

బండి సంజయ్ నివాసాల్లో సోదాలు

ఐదు బృందాలు ముమ్మర గాలింపు




పదిగ్రాములపై రూ.980ల మేర తగ్గిన ధర

రూపాయి మారకం కనిష్టానికి చేరిక

2లో..

# బంగారం ధరల్లో పతనం



2లో..

## నిజామాబాద్ జిల్లాల్లో 44 డిగ్రీల ఉష్ణోగ్రతలు

## కాకినాడ జిల్లాలో ఘోర ప్రమాదం



2లో..

- రోడ్డు దాటుతున్న కూలీలపై దూసుకెళ్లిన టిప్పర్
- ప్రమాదంలో నలుగురు మహిళా కూలీల దుర్మరణం
- ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన డిప్యూటి సిఎం

## బండి భగీరథ్‌పై లుకౌట్ నోటీసులు

హైదరాబాద్: బండి భగీరథ్ పై పేట్ బషీరాబాద్ పోలీసులు లుక్ ఔట్ నోటీసులు జారీ చేశారు. హైదరాబాద్‌లోని బండి సంజయ్ నివాసంలో తనిఖీలు చేపట్టిన సైబరాబాద్ పోలీసులు.. ఢిల్లీ, కరీంనగర్, హైదరాబాద్‌లో పోలీస్ బృందాలుగా గాలింపు కొనసాగిస్తున్నారు. అతని కోసం 5 బృందాలు గాలిస్తున్నాయని తెలిపిన పోలీసులు వెల్లడించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ కేసులో పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. పోక్సో కేసులో భగీరథ్‌కు మధ్యంతర బెయిల్ ఇచ్చేందుకు తెలంగాణ హైకోర్టు నిరాకరించింది. దీంతో భగీరథ్‌ను పోలీసులు అరెస్ట్ చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. బాలిక స్టేట్‌మెంట్ ఇప్పటికే పోలీసులు రికార్డు చేశారు. హైకోర్టు ఆదేశాల మేరకు మేజిస్ట్రేట్ ఎదుట బాధితురాలి స్టేట్‌మెంట్‌ను మరోసారి రికార్డు చేయాలని నిర్ణయించారు. ప్రస్తుతం భగీరథ్ పరారీలో ఉన్నట్లు
పోలీసులు తెలిపారు. భగీరథ్‌పై పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో మే 8న పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. బాలిక ఫిర్యాదు మేరకు నమోదైన ఈ కేసులో లైంగిక వేధింపుల ఆరోపణలు ఉన్నాయి. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసి దర్యాప్తు వేగవంతం చేశారు. ఈ కేసులో విచారణ నిమిత్తం రావాల్సిందిగా భగీరథ్‌కు పోలీసులు నోటీసులు జారీ చేశారు. అయితే పోలీసుల విచారణకు భగీరథ్ గైర్హాజరయ్యారు. అతని ఫోన్ స్విచ్ ఆఫ్‌లో ఉందని, పరారీలో ఉన్నట్టు పోలీసులు తెలిపారు. భగీరథ్ కోసం పోలీసులు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు.?

## ప్లాస్టిక్ వాడకంతో అనర్థాలు

మచిలీపట్నం: ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కంకణం కట్టుకున్నారని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. శనివారం మచిలీపట్నం రైతు బజార్ ప్రాంగణంలో జరిగిన స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని పక్కా ప్రణాళికతో నిర్వహించాలన్నారు. గ్రామ వార్డు, సచివాలయాల వారీగా ప్రతినెల మూడో శనివారం ఈ కార్యక్రమం తప్పనిసరిగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్లాస్టిక్ వాడకం వల్ల జరిగే అనర్థాలను, ప్రజలకు జరిగే నష్టాలను వివరించాలని.. దీనిపై సమగ్ర అవగాహనతో ముందుకు వెళ్లాలని అధికారులకు మంత్రి కొల్లు రవీంద్ర సూచించారు. రాష్ట్రంలో ఆర్టీసీ బస్సుల ప్రైవేటీకరణ ప్రస్తుత
పరిస్థితుల్లో తప్పనిసరి అని ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు అన్నారు. ప్రభుత్వం ఎలక్ట్రిక్ బస్సుల కొనుగోలుకు సబ్సిడీ ఇస్తున్నప్పటికీ.. ఒక్కో బస్సు ధర సుమారు రూ.1.60 కోట్ల నుంచి రూ. 1.70 కోట్ల వరకు ఉందన్నారు. ?ఇంత పెద్ద మొత్తంలో నిధులు వెచ్చించి బస్సులను కొనుగోలు చేయడం ప్రస్తుతానికి ఆర్టీసీకి, ప్రభుత్వానికి సాధ్యం కాని పనిగా చెప్పుకొచ్చారు. దీనికి బదులుగా బస్సులను ప్రైవేట్ ఆపరేటర్లకు అప్పగిస్తే.. వారే పెట్టుబడులు పెట్టి బస్సులను నడుపుతారన్నారు. దీనివల్ల ఆర్టీసీపై అదనపు ఆర్థిక భారం తగ్గుతుందని తెలిపారు. ఈాష్ట్రంలో సుమారు 10 వేల బస్సులు నడుస్తున్నాయని ఆర్టీసీ చైర్మన్ తెలిపారు. వాటన్నింటి స్థానంలో ఎలక్ట్రిక్ బస్సులను తీసుకురావాలంటే దాదాపు రూ.15 వేల కోట్లు అవసరమని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడం వల్ల ఆర్టీసీపై ఇప్పటికే ఆర్థిక భారం పెరిగిందన్నారు. ప్రయాణికులకు ఛార్జీలు పెంచే ఆలోచన ఏదీ లేదని స్పష్టం చేశారు. డీజిల్ బస్సులతో పోలిస్తే ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణ ఖర్చు చాలా తక్కువన్నారు. ఎలక్ట్రిక్ బస్సుల వల్ల పర్యావరణ కాలుష్యం తగ్గడమే కాకుండా, నిర్వహణ వ్యయం తగ్గి.. ప్రయాణికులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించే అవకాశం ఉంటుందని అన్నారు. రాబోయే రెండు నెలల్లో ఈ ఎలక్టికల్ బస్సులు అందుబాటులోకి వస్తాయని కొనకళ్ల నారాయణ పేర్కొన్నారు.

## కాకినాడ జిల్లాలో ఘోర ప్రమాదం



కాకినాడ: జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. కోవూరు బ్రిడ్జి వద్ద శనివారం జరిగిన ఒక ఘోర రోడ్డు ప్రమాదంలో నలుగురు ఉపాధి హామీ కూలీలు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. రోడ్డు దాటుతున్న కూలీలను.. టిప్పర్ లారీ బలంగా ఢీకొట్టడంతో ఈ ప్రమాదం సంభవించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉపాధి హామీ పనుల నిమిత్తం కూలీలు రోడ్డు దాటుతున్నారు. అదే సమయంలో వేగంగా దూసుకొచ్చిన ఓ టిప్పర్ లారీ వారిపైకి దూసుకెళ్లింది. లారీ వేగాన్ని నియంత్రించలేకపోవడంతోనే ఈ ఘోర ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. చనిపోయిన కూలీలు.. సత్యవతి, కృష్ణమ్మ, చిట్టెమ్మ, అన్నవరంగా గుర్తించారు. వీరంతా స్థానిక చీడిగ ప్రాంతానికి చెందినవారని పోలీసులు తెలిపారు. క్షతగాత్రులను అత్యవసర చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (ఉఉఊ)కి తరలించారు. వీరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనతో మృతుల గ్రామాల్లో విషాద ఛాయలు అలముకున్నాయి. రోడ్డు ప్రమాదంపై రాష్ట్ర మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి, జిల్లా ఇంచార్జి మంత్రి పొంగూరు నారాయణ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పొట్టకూటి కోసం పనులకు వెళ్తున్న నలుగురు మహిళా కూలీలు ఈ ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందడం అత్యంత బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబ సభ్యులకు మంత్రి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రమాద ఘటనపై సమాచారం అందిన వెంటనే మంత్రి నారాయణ స్థానిక అధికారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారికి ఎలాంటి లోటు రాకుండా, తక్షణమే మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా యంత్రాంగాన్ని, వైద్య అధికారులను ఆయన ఆదేశించారు. ప్రభుత్వం వారికి అన్ని విధాలా అండగా ఉంటుందని మంత్రి నారాయణ భరోసా ఇచ్చారు. ఘోర రోడ్డు ప్రమాదంపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో నలుగురు మహిళా ఉపాధి హామీ శ్రామికులు మృతి
చెందడం బాధాకరమని అన్నారు. చీడిగ గ్రామానికి చెందిన ఆరుగురు మహిళా శ్రామికులు రోడ్డు దాటుతుండగా టిప్పర్ ఢీ కొట్టడంతో ఈ ప్రమాదం జరిగినట్టు అధికారులు చెప్పారని డిప్యూటీ సీఎం తెలిపారు. పని ప్రదేశంలో ఇలాంటి విషాదకర ఘటన జరగడం తీవ్రంగా కలచివేసిందని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కాకినాడ జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించినట్లు వెల్లడించారు. బాధితులు పూర్తిగా కోలుకునే వరకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని చెప్పారు. మృతి చెందిన శ్రామికుల కుటుంబాలకు కూటమి ప్రభుత్వం పెంచిన పరిహారం రూ.4 లక్షలను త్వరితగతిన అందజేస్తామని తెలిపారు. లాగే రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.2 లక్షల సహాయంతో పాటు పీఎం సురక్ష యోజన, పీఎం జీవన్ జ్యోతి యోజన కింద లభించే బీమా మొత్తాన్ని కూడా అందిస్తామని పేర్కొన్నారు. ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా రహదారుల పక్కన జరుగుతున్న ఉపాధి పనుల వద్ద భద్రతా చర్యలు కట్టుదిట్టం చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా జాతీయ రహదారులు, బైపాస్ రోడ్లు, ట్రాఫిక్ అధికంగా ఉండే ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి వాహనాల వేగ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సూచించారు.

## మన సంస్కృతీసంప్రదాయాలు చిరస్మరణీయమని కితాబు



న్యూఢిల్లీ: సెమీకండక్టర్ల విషయంలో భారత్ కీలక ముందడుగు వేసిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. భారతదేశం అభివృద్ధిలో దూసుకెళ్తోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. డిజిటల్ చెల్లింపుల్లో ప్రపంచంలోనే భారత్ అగ్రస్థానంలో ఉందని చెప్పారు. దేశంలో ప్రస్తుతం నెలకు 20 బిలియన్ డాలర్ల డిజిటల్ ట్రాన్సాక్షన్లు జరుగుతున్నాయని తెలిపారు. భారత్‌లో ఒకప్పుడు కేవలం 4 యూనికార్న్ సంస్థలే ఉండేవని.. ప్రస్తుతం అవి 100కు చేరాయన్నారు. సెమీకండక్టర్ల అంశంలోనూ భారత్ ముందడుగు వేసిందని.. ఆ దిశగా పనులు కూడా జరుగుతున్నాయని పేర్కొన్నారు. నెదర్లాండ్స్ పర్యటనలో ఉన్న ప్రధాని నరేంద్ర మోదీ.. ది హేగ్ నగరంలో ప్రవాస భారతీయులను కలిశారు. వారితో మాటామంతీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌ఆర్‌ఐలపై ప్రశంసలు కురిపించారు. లక్ష్యాలను అధిగమించి వారు పని చేస్తున్నారని కొనియాడారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రధానికి ఘనస్వాగతం లభించింది. ప్రవాస భారతీయులతో కరచాలనం, మాటామంతీ నిర్వహించారు. నెదర్లాండ్స్ నాయకత్వంతో ఎప్పుడు మాట్లాడినా ప్రవాస భారతీయులను ఎంతో ప్రశంసించేవారని ప్రధాని గుర్తు చేసుకున్నారు. హేగ్ నగరం భారతీయ స్నేహానికి సజీవ చిహ్నంగా మారిందన్నారు. కాలం మారినా.. భారతీయ సంస్కృతి మారలేదని కొనియాడారు. ఈ సందర్భంగా ఈయూ దేశాలనుద్దేశించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. డిజిటల్ చెల్లింపుల్లో భారత్ అగ్రస్థానంలో ఉంది. నెలకు 20 బిలియన్ డాలర్ల విలువైన డిజిటల్ చెల్లింపులు జరుగుతున్నాయి. భారత్‌లో ఒకప్పుడు కేవలం 4 యూనికార్న్ సంస్థలే ఉండేవి. ఇప్పుడు 100కిపైగా ఉన్నాయి. భారత్‌లో సెమీ కండక్టర్ ప్లాంట్ల పనులు జరుగుతున్నాయి. మేడిన్ ఇండియా చిప్‌లు తయారవుతున్నాయి. ఏఐ సమ్మిట్, జీ20 సమావేశాలను విజయవంతంగా నిర్వహించగలిగాం. భారత్‌లో 90 కోట్ల మంది ఓటర్లుగా నమోదయ్యారు. 2024 లోక్ సభ ఎన్నికల్లో 64 కోట్ల మంది ఓటు వేశారు. ఈయూ దేశాల జనాభా మొత్తం కలిపినా 64 కోట్ల మంది కూడా లేరని మోదీ తెలిపారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మాట్లాడుతూ.. 'ఇంతటి ప్రేమ, ఉత్సాహాన్ని చూసి నెదర్లాండ్స్‌లో ఉన్నానన్న సంగతి ఒక్క క్షణం మర్చిపోయాను. భారతదేశంలోనే ఓ ఉత్సవానికి హాజరైనట్లు అనిపించింది. భారత స్నేహానికి ది హేగ్ సజీవ చిహ్నంగా మారిందని అనిపిస్తోంది. నేను నెదర్లాండ్స్ నాయకత్వంతో మాట్లాడిన ప్రతిసారీ వారు ప్రవాస భారతీయులను ప్రశంసిస్తూనే ఉంటారు.
నెదర్లాండ్స్ సమాజానికి, ఆర్థిక వ్యవస్థకు మీరు చేసిన సేవకు ప్రతి భారతీయుడు గర్వపడుతున్నాడు. మీ పూర్వీకులు ఇక్కడికి వచ్చినప్పుడు ఎన్నో విషయాలను వదిలేశారు. కానీ కొన్ని విషయాలు ఎల్లప్పుడూ వారితోనే ఉండిపోయాయి. భారతదేశ మట్టి పరిమళం, పండుగల జ్ఞాపకాలు, భక్తి గీతాల రాగాలు, పూర్వీకులు అందించిన విలువలు వారితోనే ఉన్నాయి. కాలక్రమేణా ఎన్నో సంస్కృతులు కనుమరుగయ్యా యనే వాస్తవానికి మానవ చరిత్రే సాక్ష్యం. కానీ భారతదేశ విభిన్న సంస్కృతి ఇప్పటికీ మన ప్రజల హృదయాల్లో బలంగా ఉంది. తరాలు మారాయి, దేశాలు మారాయి, పరిసరాలు మారాయి, కానీ కుటుంబ విలువలు, మనం ఒక సమూహానికి చెందినవారమనే భావన ఎన్నడూ మారలేదు. సరిగ్గా 12 ఏళ్ల క్రితం ఇదే రోజున, 2014 మే 16న లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. దశాబ్దాల తర్వాత భారతదేశంలో సంపూర్ణ మెజారిటీతో స్థిరమైన ప్రభుత్వం ఏర్పడింది. అప్పటి నుంచి కోట్లాది మంది భారతీయుల నమ్మకం నన్ను ఆగనివ్వదు, అలసిపోనివ్వదు' అని చెప్పుకొచ్చారు.

# పేదరికం లేని సమాజామే లక్ష్యం




శ్రీకాకుళం: పేదరికం లేని సమాజం చూడాలనేదే తన కోరిక అని సీఎం చంద్రబాబు అన్నారు. సమాజం మారితే స్వచ్ఛాంధ్ర సాకారమవుతుందని చెప్పారు. శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట పర్యటనలో ఉన్న సీఎం చంద్రబాబు.. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తలసరి ఆదాయం పెంచాలనేది తన ప్రధాన లక్ష్యమన్నారు. సంపద సృష్టించి పేదవాళ్లకు పంచాలి. ఆర్థిక అసమానతలు తగ్గించాలి. ప్రభుత్వానికి మంచిపేరు వచ్చిందంటే అది అధికారుల వల్లే వస్తుంది. స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్రతో స్వచ్ఛత వైపు అడుగులు వేస్తున్నాం. స్వచ్ఛమైన ఆలోచనలు చేయాలి. అదే మనకు మంచి చేస్తుంది. అలవాట్లు మారాలి.. తద్వారా సమాజం మారుతుంది. గత 16 నెలలుగా స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర నిర్వహిస్తున్నాం. వ్యర్థాల నుంచి కరెంట్ ఉత్పత్తి చేస్తున్నాం. ఒకప్పుడు నా పాదయాత్రల సమయంలో చెత్తే ఎక్కువ కనిపించేది. చెత్త నుంచి సంపద సృష్టించడానికి పార్కులు ఏర్పాటు చేశాం. సింగిల్ యూజ్ ఎ÷-లాస్టిక్‌ను నిషేధించాలి. గత 23 నెలల్లో రాష్ట్రానికి రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలతో మన పిల్లలకు 24 లక్షల ఉద్యోగాలు వస్తాయి. విశాఖకు గూగుల్ తీసుకొచ్చాం. పరిశ్రమలతో ఉత్తరాంధ్రకే వలసలు రావాలని చంద్రబాబు అన్నారు. ఒకప్పుడు కుటుంబ నియంత్రణ పాటించాలని చెప్పాం. పిల్లలే సంపద అని ఇవాళ చెబుతున్నా. మూడో బిడ్డ పుట్టిన వెంటనే రూ.30 వేలు ఇస్తాం. నాలుగో బిడ్డ పుడితే.. రూ.40 వేలు ఇస్తాం. పిల్లలు భారమనుకోకూడదు.. వాళ్లే సంపద అని గుర్తించాలి. తల్లికి వందనం కింద రూ.15 వేలు అందిస్తున్నాం. భగవంతుడు కరుణిస్తే.. ఈ మొత్తాన్ని పెంచుతాం అని అన్నారు. గత ఐదేళ్లు గొడ్డలి పార్టీ చేసిన అరాచకం చూశాం. ప్రజల ఆస్తులన్నీ మార్చేసి గందరగోళం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల భూముల జోలికి ఎవరూ రాకుండా చర్యలు చేపట్టాం. భూ తగాదాలు లేకుండా చేసే బాధ్యత కూటమి ప్రభుత్వానిది.

## ఐసిసి టెర్రరిస్ట్ అబూ బిలాల్ అల్ మినుకీ హతం



వాషింగ్టన్: ఉగ్రసంస్థ ఐసిస్‌కు చెందిన మరో మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్టును మట్టుపెట్టామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా ప్రకటించారు. నైజీరియా దళాలతో కలిసి అమెరికా దళాలు ఐసిస్ టెర్రరిస్టు అబూ బిలాల్ అల్ మినుకీని అంతం చేశాయని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఐసిస్ కార్యకలాపాలను పర్యవేక్షించే అతడు సంస్థలో నెం.2 నాయకుడిగా ఉండేవాడని ట్రంప్ చెప్పారు.
ఆఫ్రికాలో దాక్కుంటే తనను ఎవరు ఏమీ చేయలేరని అతడు భావించాడని అన్నారు. కానీ అతడి సమాచారం తమకు నిత్యం అందుతూనే ఉందన్న విషయాన్ని మాత్రం పసిగట్టలేకపోయాడని ఎద్దేవా చేశారు. ఆఫ్రికా ప్రజలకు అతడి పీడ విరగడయ్యిందని కూడా ట్రంప్ వ్యాఖ్యానించారు. అతడి ఉగ్రనీడ తొలగిపోయిందని చెప్పారు. అబూ బిలాల్ అంతంతో ఐసిస్ గ్లోబల్ కార్యకలాపాలకు కూడా పెద్ద దెబ్బతగిలిందని చెప్పారు. ఈ మిషన్‌లో అమెరికా దళాలకు సహకరించిన నైజీరియా ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. అమెరికా, నైజీరియా సంయుక్తంగా ఈ ఆపరేషన్ నిర్వహించాయి. అతడి మృతితో ప్రపంచవ్యాప్తంగా ఐసిస్ కార్యకలాపాలు మరింత బలహీనమవుతాయని ట్రూత్‌లో ట్రంప్ పోస్టు పెట్టారు. నా ఆదేశాల మేరకు అమెరికా బలగాలు, నైజీరియా భద్రతా బలగాలు ఐసిస్ అగ్ర కమాండర్ అబు-బిలాల్ అల్-మినూకిని మట్టుబెట్టాయి. ఐసిస్‌లో రెండో అత్యున్నత హోదాలో ఉన్న మినూకి ఆఫ్రికాలో దాక్కోగలనని భావించాడు. కానీ మా గూఢచార వర్గాలు అక్కడా ఉన్నాయనే విషయం తెలుసుకోలేక పోయాడు. ఇక అతడు ఆఫ్రికా ప్రజలను భయభ్రాంతులకు గురిచేయలేడు. అమెరికన్లు లక్ష్యంగా ఆపరేషన్లకు ప్లాన్ చేయడంలో సహకరించలేడు. అమెరికాతో కలిసి పనిచేసిన నైజీరియా ప్రభుత్వానికి థాంక్స్‘ అని ట్రంప్ రాసుకొచ్చారు. నైజీరియాలో జన్మించిన మినూకి ఇస్లామిక్ స్టేట్ వెస్ట్ ఆఫ్రికా ప్రావిన్స్ సీనియర్ కమాండర్. ఇస్లామిక్ స్టేట్ తరఫున టెర్రర్ సెల్స్‌కు సూచనలు ఇవ్వడం, అంతర్జాతీయ నిధులను దారి మళ్లించడం వంటి కార్యకలాపాల్లో పాల్గొనేవాడు. ఆ ఆరోపణలతో 2023లో అమెరికా అతడిని ఉగ్రవాదిగా గుర్తించింది.

# ఆర్థిక కార్యాచరణ అత్యవసరం !

నాలుగు రాష్ట్రాలఅసెంబ్లీ ఎన్నికలు ముగిశాక బిజెపిలో కనిపించినంత ఆనందం మిగతా పార్టీల్లో కనిపించలేదు. కేరళలో అధికారం దక్కించుకున్నా కూడా కాంగ్రెస్ లో అంతటి ఆనందం కనిపించలేదు. బెంగాల్ దక్కడంతో బిజెపిలో ఎక్కడలేని ఆనందం, ఉత్సాహం కనిపించింది. ఆ ఆనందాన్ని ప్రజలతో పంచుకునేందుకు బిజెపి సిద్దంగా లేదు. ఎందుకంటే పెట్రో,డీజిల్ ధరలు పెంచడం, ఆర్థిక వ్యవస్త రోజురోజుకూ కుదేలవ్వడంతో ప్రజల్లో ఒకింత నిరాసక్తి కనిపిస్తోంది. కొత్తగా రెండు రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలోకి వచ్చింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ ఆనందంలో ఉండగానే దేశ ఆర్థిక వ్యవస్థ తీవ్ర కష్టనష్టాల నెదుర్కొంటున్న వాస్తవాన్ని గుర్తించారు. హైదరాబాద్ పర్యటనలో ఆయన చేసిన వ్యాఖ్యలు రానున్న ముప్పును ముందే గమనించి చేసిన హెచ్చరికగా గుర్తించాలి. ఈ క్రమంలో ఒక్క బంగారం దిగుమతులే కాకుండా దేశీయ వ్యవసాయ రంగాన్ని దెబ్బతీస్తున్న ఆహార దిగుమతులను కూడా నిలిపి వేయడం మంచిదని ప్రధాని ఎంత త్వరగా గుర్తిస్తే అంత మంచిది. ఆర్థిక వ్యవస్థ రానున్న రోజుల్లో మరింత బలహీనం కానుందన్న కఠోర సత్యాన్ని మోడీ ఒప్పుకున్నారు. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు చేసిన తప్పులకు ప్రజలు త్యాగాలు చేయాలని ప్రధానమంత్రి పిలుసపునిస్తున్నట్లుగా ఉంది. అందువల్ల రాజకీయ నాయకులకు సంబంధించి విప్లవాత్మక మార్పులు తీసుకుని వస్తే తప్ప సంక్షోభాన్ని గట్టెక్కలేమని ప్రధాని మోడీ గుర్తించడం లేదు. ఇరాన్‌పై అమెరికా,ఇజ్రాయెల్ సంయుక్త దాడులతో మొదలు పెట్టిన యుద్ధం ప్రారంభమై ఈ నెలాఖరుకు మూడు నెలలు పూర్తవుతాయి. ఫిబ్రవరి 28న మొదలైన ఈ యుద్ధం ఇప్పట్లో ముగుస్తుందనడానికి లేదు. ట్రంప్ రోజుకో మాట మాట్లాడుతున్నారు. ఆయన తీరు చూస్తుంటే యుద్ధం ఆగిపోయే సూచనలు కానరావడం లేదు. పశ్చిమాసియాలోని దేశాలన్నీ ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఆ యుద్ధంలో పాల్గొంటూనే ఉన్నాయి. ఈ క్రమంలో చమురు సరఫరా నిలిచి పోయింది. హోర్ముజ్ జలసంధి వద్ద అమెరికా ,ఇరాన్‌లు పట్టుబిగించాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 107 డాలర్లుగా ఉన్నది; రూపాయి మారకం విలువ డాలర్‌కు రూ.96కు చేరువలో ఉన్నది. రూపాయి విలువ ఎన్నడూ ఇంతగా పతనం కాలేదు. నిత్యం దాని ధర
పతనం అవుతూనే ఉంది. దీనికి కారణం ఇబబడిముబ్బడిగా దిగుమతులే కారణమని చెప్పనక్కరలేదు. విదేశీ మారక నిల్వలు తగ్గిపోతున్నాయి. అధికారికంగా వినియోగ ధరల సూచీ ద్రవ్యోల్బణం 3.5శాతం కాగా ఆహార ద్రవ్యోల్బణం 4.33శాతంగా ఉంది. గృహావసరాల ఎల్‌పీజీ సిలిండర్ ధర రూ.913 కాగా కమర్షియల్ సిలిండర్ ధర రూ.3077 నుంచి రూ.3237 దాకా ఉంటోంది; డబ్ల్యూపీఐ ద్రవ్యోల్బణం 8.3శాతంగా ఉంది. ఇవన్నీ కూడా మన ఆర్థిక దౌర్బల్యాన్ని సూచిస్తున్నాయి. నేరుగా ఇవన్నీ ప్రజలపై తీవ్ర ప్రభావం చూపుతున్నవని గుర్తించాలి. దీనిని తట్టుకుని నిలబడేందుకు ధరలు పెంచడం మార్గం కాదు. ప్రజల్లో కొనుగోలు శక్తి పెరగడానికి చర్యలు తీసుకోవడం లేదు. దేశీయంగా ఆహార వస్తువులను ప్రజలకు నేరుగా, చౌకగా అందించే ప్రణాళికలు చేయడం లేదు. తెలుగు రాష్ట్రాలను తీసుకుంటే ఇక్కడ వరి, మిర్చి, శనగ,మక్కజొన్న తదితర పంటలు విపరీతంగా పండుతున్నాయి. ఇవి పండిస్తున్న రైతులకు గిట్టుబాటు ధరలు దక్కడం లేదు. అలాగే కొనుగోలుదారులకు సరసమైన ధరలకు వస్తువులు దక్కడం లేదు. ఈ వ్యత్యాసాన్ని ప్రభుత్వాలు గుర్తించడం లేదు. బంగారం దిగుమతులను నిలిపివేయడంతో పాటే ఇతర నిత్యావసరాల దిగుమతులను కూడా నిలిపివేయాలి. దేశీయంగా పండుతున్న పంటలకు పోటీగా వస్తున్న ఆహారా ధాన్యాల దగుమతులపై ఆంక్షలు విధించాలి.


## పెట్రో ధరల పెంపు..ప్రజల నెత్తిన పిడుగు

హైదరాబాద్: పెట్రో ధరల పెంపు వల్ల నిత్యావసరాల ధరలు పెరిగి సామాన్యుల పాలిట పిడుగుపాటు అవుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై స్పందించారు. నరేంద్ర మోదీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం తాజాగా తీసుకున్న పెట్రోల్, డీజిల్ ధరల పెంపు నిర్ణయం ఏ మాత్రం సమర్థనీయం కాదని సోషల్ మీడియా ఎక్స్ వేదికగా అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం అనేక రంగాలపై వ్యతిరేక ప్రభావం చూపుతుందని తెలిపారు.మోదీ ప్రభుత్వ అసమర్థ పాలన, అనాలోచిత విధానాల కారణంగా దేశ ఆర్థిక వ్యవస్థ కుదేలైందని సీఎం విమర్శించారు. ఆత్మనిర్భర్ కేవలం ఓట్లు రాల్చే నినాదమే తప్ప.. ఫలితాలు తెచ్చిన పాలసీ కాదన్నది తేలిపోయిందని సీఎం అన్నారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమలు దెబ్బతిన్నాయని... యువత ఉపాధికి గ్యారెంటీ లేని పరిస్థితి దాపురించిందని వ్యాఖ్యానించారు. రైతుల ఆదాయాలు రెట్టింపు చేస్తామన్న హామీ ఒట్టి మాటగా మిగిలిందన్నారు. గత పదేళ్లుగా రూపాయి విలువ పతనమవుతూ వస్తోందని... ఇప్పుడు ఆ పతనం పరాకాష్ఠకు చేరిందని అన్నారు. ఈ పరిస్థితుల్లో ఇరాన్ - ఇజ్రాయిల్ యుద్ధాన్ని సాకుగా చూపి పెట్రోల్, డీజిల్ రేట్లను పెంచడం సామాన్యుల నడ్డి విరచడమే అంటూ విరుచుకుపడ్డారు. ప్రపంచంలో భారత్‌ను మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలిపామని ఘనంగా ప్రకటించుకుంటున్న మోదీ ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని ఎలా సమర్థించుకుంటుందని రేవంత్ ప్రశ్నించారు. ఇటీవల జరిగిన నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంత ఎన్నికలకు ముందు మోదీ ప్రభుత్వం 'పెట్రోలియం ఉత్పత్తుల ధరలు పెంచం' అని
పదే పదే ప్రకటించిందని గుర్తుచేశారు. ఫలితాలు వచ్చి పది రోజులు కూడా గడవకముందే రూ.3 కు పైగా ధరలు పెంచడం ప్రజల నమ్మకాన్ని వంచించడమే అని అన్నారు. కేవలం ఓట్ల కోసం, ఎన్నికల్లో విజయం కోసం మోదీ అబద్దాలు చెబుతారని ప్రజలు భావిస్తున్నారని... ఇది విశ్వాస ఘాతుకం అవుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోలు, డీజిల్ ధరలను తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ రేవంత్ రెడ్డి ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

## బంగారం ధరల్లో పతనం

న్యూఢిల్లీ: భారత్‌లో శనివారం కూడా బంగారం, వెండి ధరల్లో పతనం కనిపించింది. అంతర్జాతీయ అనిశ్చితులకు తోడు యూఎస్ డెట్ సెక్యూరిటీలపై రాబడులు పెరగడం, డాలర్ బలపడుతున్న నేపథ్యంలో దేశంలో బంగారం, వెండి ధరలు మరోసారి తగ్గాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, శనివారం ఉదయం 10.00 గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర శుక్రవారంతో పోలిస్తే రూ.980ల మేర తగ్గి రూ.1,56,930కు పడిపోయింది. 22 క్యారెట్ల ఆర్నమెంటల్ పసిడి ధర కూడా రూ.900ల మేర తగ్గి రూ.1,43,850కు చేరుకుంది. నగరంలో కిలో వెండి ధర రూ.15 వేల మేర తగ్గి రూ.2.9 లక్షలకు దిగింది. దేశవ్యాప్తంగా 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర సగటున రూ.950 మేర తగ్గింది. వెండి ధరలో రూ.10 వేల మేర కోత పడింది. చెన్నైలో ప్రస్తుతం 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,60,910కు చేరుకుంది. 22 క్యారెట్ల గోల్డ్ రూ.1,47,500 వద్ద ట్రేడవుతోంది. న్యూఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,57,080గా, 22 క్యారెట్ల పసిడి ధర రూ.1,44,000గా ఉంది. ముంబైలో 10 గ్రాముల పసిడి ధర రూ.1,56,930కు చేరుకోగా 22 క్యారెట్ల వెండి ధర 1,43,850కు చేరింది. దేశంలోని అన్ని ప్రధాన నగరాల్లో కిలో వెండి ధర రూ.3 లక్షల మార్కు దిగువకు చేరుకుంది. చెన్నైలో గరిష్ఠంగా కిలో వెండి రూ.2.9 లక్షల వద్ద ట్రేడవుతోంది. ఇదిలావుంటే భారత కరెన్సీ సరికొత్త జీవితకాల కనిష్ఠ స్థాయికి పతనమైంది. ఫారెక్స్ ట్రేడింగ్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ శుక్రవారం ఒక దశలో 50 పైసలు క్షీణించి రూ.96.14కు చేరుకుంది. డాలర్-రూపీ ఎక్స్ఛేంజ్ రేటు రూ.96 మార్క్‌ను దాటడం ఇదే తొలిసారి. అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలతోపాటు అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు మళ్లీ పెరగడం, డాలర్ బలోపేతం, దేశీయంగా ధరలు మరింత ఎగబాకవచ్చన్న ఆందోళనలు ఇందుకు ప్రధాన కారణమయ్యాయి. అయితే, ఆర్‌బీఐ జోక్యంతో రూపాయి మళ్లీ కాస్త కోలుకుంది. దాంతో డాలర్‌తో మారకం రేటు 17 పైసల నష్టంతో రూ.95.81 వద్ద ముగిసింది. ఇది కనిష్ఠ ముగింపు స్థాయి కూడా. గురువారం సెషన్‌లో డాలర్‌తో రూపీ మారకం రేటు 2 పైసలు లాభపడి రూ.95.64 వద్ద క్లోజైంది. అంతర్జాతీయంగా ఆరు ప్రధాన కరెన్సీలతో పోలిస్తే డాలర్ ఇండెక్స్ 0.34 శాతం పెరిగి 99.15 స్థాయిలో ట్రేడైంది. బ్రెంట్ ముడి చమురు బ్యారల్ ధర ఒక దశ లో 3.14 శాతం పెరిగి 109.04 డాలర్లకు చేరుకుంది. 6 రోజుల్లో 2 శాతం డౌన్: గడిచిన 6 ట్రేడింగ్ సెషన్లలో డాలర్‌తో రూపాయి మారకం విలువ దాదాపు 2 శాతం క్షీణించింది. ఈ ఏడాదిలో ఇప్పటివరకు 6 శాతానికి పైగా పతనమైంది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, దాంతో చమురు ధరలు 100 డాలర్ల పైకి ఎగబాకడం, మన ఈక్విటీ మార్కెట్ నుంచి విదేశీ సంస్థాగత పెట్టుబడుల నిరవధిక ఉపసంహరణ, ద్రవ్యోల్బణ భయాలు, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ) ప్రవాహం తగ్గడం వంటి అంశాలు మన కరెన్సీపై ఒత్తిడి పెంచాయని ఫారెక్స్ వర్గాలు పేర్కొన్నాయి. కాగా రూపాయిపై ఒత్తిడి కొనసాగనుందని మిరే అసెట్ షేర్‌ఖాన్ రీసెర్చ్ అనలిస్ట్ అనూజ్ చౌదరి అన్నారు. మున్ముందు సెషన్లలో డాలర్-రూపీ ఎక్స్ఛేంజ్ రేటు రూ.95.60-96.20 శ్రేణిలో కదలాడవచ్చన్నారు.

## నిజామాబాద్ జిల్లాల్లో 44 డిగ్రీల ఉష్ణోగ్రతలు



హైదరాబాద్: ఈ నెల 26న నైరుతి రుతుపవనాలు అండమాన్ నికోబార్ దీవుల మీదుగా కేరళ తీరాన్ని తాకుతాయని, అక్కడి నుంచి నాలుగైదు రోజుల్లో తెలంగాణలో ప్రవేశిస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. అయితే తెలంగాణలో మాత్రం ఎండల తీవ్ర తగ్గడం లేదు. ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో 44 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వాతావరణ అధికారి ధర్మరాజు తెలిపారు. మహబూబ్‌నగర్, గద్వాల, నారాయణపేట జిల్లాల్లో 41-44 డిగ్రీలు, మిగతా జిల్లాల్లో 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు చెప్పారు. శనివారం భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముంది.

ఉత్తేజిత దినపత్రిక



## ఉప్పరపల్లి రోడ్డు విస్తరణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి

**లినిర్దేశిత గడువులోగా నాణ్యమైన ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు ఆదేశం..**

**తిరుపతి ఉత్తేజిత మే 16.**



తిరుపతి నగర ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు తీర్చడమే ధ్యేయంగా తుడా ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, నిర్దేశిత గడువులోగా పనులను పూర్తి చేయాలని తుడా ఛైర్మన్ తిరుమల తిరుపతి దేవస్థానం ఎక్స్ అఫిషియో మెంబర్ తెదేపా తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి డాలర్స్ దివాకర్ రెడ్డి స్పష్టం చేశారు.ఉప్పరపల్లి పరిధిలో జరుగుతున్న ప్రధాన రోడ్డు విస్తరణ,డ్రైనేజీ నిర్మాణ పనులను ఆయన తుడా అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల ప్రగతిని అడిగి తెలుసుకున్న ఆయన, కాంట్రాక్టర్‌కు మరియు ఇంజనీరింగ్ అధికారులకు పలు కీలక సూచనలు, సలహాలు ఇచ్చారు.ఉప్పరపల్లి రోడ్డు అత్యంత రద్దీగా ఉండే ప్రాంతం కాబట్టి, పనుల వల్ల స్థానిక ప్రజలకు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా బారికేడ్లు,సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు.ఉప్పరపల్లి రోడ్డు విస్తరణ ఈ ప్రాంత ప్రజల దశాబ్దాల కల అని,పనులను వేగవంతం చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో తుడా సెక్రటరీ డా యన్ వి శ్రీకాంత్ బాబు,ఇంజనీరింగ్ అధికారులు,మరియు కాంట్రాక్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు

## ఇంధన పొదుపు - దేశాభివృద్ధికి మూలాధారం....ప్లాస్టిక్ నిషేధంపై ప్రతిజ్ఞ చేసిన వాహనదారులు...?తిరుపతి రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ అవగాహన కార్యక్రమం...

**తిరుపతి, ఉత్తేజిత మే 16:**



ప్రస్తుత ఇంధన సంక్షోభాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ ఇంధన పొదుపును సామాజిక బాధ్యతగా భావించాలని జిల్లా రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ పిలుపునిచ్చారు. శనివారం తిరుపతిలోని జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో 'స్వర్ణాంధ్ర -- స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమంలో భాగంగా వాహన వినియోగదారులకు ప్లాస్టిక్ నిషేధం మరియు ఇంధన పొదుపుపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు.

?ఈ సందర్భంగా మురళీమోహన్ మాట్లాడుతూ, పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలు మరియు పర్యావరణ కాలుష్యాన్ని అరికట్టాలంటే పొదుపు మంత్రమే శరణ్యమని పేర్కొన్నారు. ఇంధనం దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక వంటిదని, ప్రతి చుక్కను పొదుపు చేయడం అంటే దేశ సంపదను కాపాడటమేనని ఆయన వివరించారు.మోటారు వాహన తనిఖీ అధికారి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద లేదా ఎక్కువ సమయం వేచి ఉండాల్సి వచ్చినప్పుడు వాహనాన్ని స్టార్ట్‌లో ఉంచకుండా ఇంజిన్‌ను ఆఫ్ చేయాలని సూచించారు. ఆకస్మికంగా వేగం పెంచడం, హఠాత్తుగా బ్రేకులు వేయడం తగ్గించి, నియమిత వేగంతో ప్రయాణించడం ద్వారా ఇంధనాన్ని ఆదా చేయవచ్చని తెలిపారు. మరో అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ, సకాలంలో సర్వీసింగ్ చేయించడం, టైర్లలో సరైన గాలి ఒత్తిడి ఉండేలా చూసుకోవడం మరియు ఎయిర్ ఫిల్టర్లు, స్పార్క్ ప్లగ్‌లను క్రమం తప్పకుండా తనిఖీ చేయించుకోవాలని స్పష్టం చేశారు.వాహన తనిఖీ అధికారి అతికా నాజ్ మాట్లాడుతూ, తక్కువ దూరాలకు నడక లేదా సైకిల్ వాడాలని, సాధ్యమైనంత వరకు 'కార్ పూలింగ్' విధానాన్ని అనుసరించాలని కోరారు. అనంతరం, పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ వాడకాన్ని నిలిపివేయాలని మరియు ఇంధన పొదుపును పాటిస్తామని కార్యాలయ సిబ్బంది, వాహనదారులు కలిసి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ అధికారులు, సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో వాహనదారులు పాల్గొన్నారు.

## పరిసరాలు అందరూ శుభ్రంగా ఉంచుకోవాలి :మండల అధికారి అమీరున్నిసా బేగం

**ఆత్మకూరు ఉత్తేజిత**



కొత్తపల్లి మండలం గువ్వలగుంట్ల గ్రామంలో 3 వ శనివారం జరిగిన స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో గువ్వలగుంట్ల గ్రామ పంచాయతీ కి స్పెషల్ ఆఫీసర్ అయిన మండల వ్యవసాయ అధికారి అమీరున్నిసా బేగం పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత సమాజాన్ని రూపొందించేందుకు ప్రజలు సహకరించాలని అని పిలుపునిచ్చారు అదేవిధంగా మనం ఆరోగ్యంగా ఉండాలంటే మొదటగా మన పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పరిశుభ్రత అనేది మన జీవితంలో చాలా ముఖ్యం. మన ఇల్లు, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవడం వల్ల వ్యాధులు రాకుండా మనం నియంత్రించవచ్చు. అంతేకాదు, పరిశుభ్రంగా ఉన్న చోట మనసుకు ప్రశాంతత కూడా ఉంటుంది అనిఆమె తెలిపారు.పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటామని ప్రజలచేత ప్రతిజ్ఞ చేయించారు. సింగిల్ యూస్ ప్లాస్టిక్ వాడకంని తగ్గించాలి. ఈ కార్యక్రమంలో స్వర్ణ గ్రామ సిబ్బంది, ప్రజలు,పాల్గొన్నారు.

## తిరుపతి విశిష్టతను కాపాడండి... తిరుపతి స్థానిక రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు డి.ఎం.సి భాస్కర్ విజ్ఞప్తి...

**తిరుపతి ఉట్టేజిత మే 16.**



?తిరుపతి ఆధ్యాత్మిక నగరం అని, ఇక్కడ రాజకీయ ధర్నాలు, పోటీ ధర్నాలు మరియు ఆందోళనలు చేయడం వల్ల నగరం యొక్క విశిష్టత దెబ్బతింటుందని తిరుపతి స్థానిక రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు డి.ఎం.సి భాస్కర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన వైసీపీ, టీడీపీ మరియు జనసేన పార్టీల అగ్ర నాయకులకు, మహిళా నేతలకు ఒక బహిరంగ విన్నపం చేశారు.

?ఈ సందర్భంగా డి.ఎం.సి భాస్కర్ మాట్లాడుతూ, తిరుపతి కేవలం ఒక నగరం మాత్రమే కాదని, ఇది ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన పుణ్యక్షేత్రమని పేర్కొన్నారు. ఇక్కడ నిరంతరం రాజకీయ పోరాటాలు, ఆందోళనలు నిర్వహించడం వల్ల స్థానికులతో పాటు సుదూర ప్రాంతాల నుండి వచ్చే భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన తెలిపారు. రాజకీయ లబ్ధి కోసం చేసే ఇటువంటి చర్యల వల్ల నగర పవిత్రతకు భంగం కలుగుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

?తిరుపతి విశిష్టతను కాపాడవలసిన బాధ్యత అన్ని రాజకీయ పార్టీలపై ఉందని ఆయన స్పష్టం చేశారు. ఏదైనా సమస్య ఉంటే దానిని చట్టపరమైన మార్గాల్లో లేదా చర్చల ద్వారా పరిష్కరించుకోవాలి తప్ప, వీధుల్లో ఆందోళనలకు దిగకూడదని కోరారు. తిరుపతి ప్రతిష్టను కాపాడటంతో పాటు, ఇక్కడ నివసించే వారి హక్కుల కోసం, ముఖ్యంగా స్థానిక రిజర్వేషన్ల కోసం తాము చేస్తున్న పోరాటానికి అందరూ మద్దతు తెలపాలని డి.ఎం.సి భాస్కర్ ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. రాజకీయాలకు అతీతంగా నగరాభివృద్ధికి, శాంతికి సహకరించాలని కోరుతూ 'జై తిరుపతి' అని ఆయన తన సందేశాన్ని ముగించారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు...ఎంఈఓ రంగనాథయ్య

**?రేణిగుంట, ఉత్తేజిత మే 16:**



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు లభించే నాణ్యమైన విద్య మరియు వసతులను సద్వినియోగం చేసుకోవాలని రేణిగుంట మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) రంగనాథయ్య పిలుపునిచ్చారు. శనివారం మండల పరిధిలోని వెదుళ్ల చెరువు మరియు ఎస్టీసీ కాలనీ పరిసర ప్రాంతాల్లో "బడి పిలుస్తోంది" కార్యక్రమంలో భాగంగా భారీ 'ఎన్రోల్మెంట్ డ్రైవ్' నిర్వహించారు.ఇంటింటికీ వెళ్లి అవగాహనఈ సందర్భంగా ఎంఈఓ రంగనాథయ్య ఉపాధ్యాయ బృందంతో కలిసి ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో నేడు కార్పొరేట్ స్థాయికి దీటుగా వసతులు కల్పిస్తున్నామని వివరించారు. ముఖ్యంగా రాష్ట్ర స్థాయిలో పదవ తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సాధిస్తున్న ఉత్తమ మార్కులు మరియు ర్యాంకుల గురించి తల్లిదండ్రులకు వివరించి, తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు.విద్యార్థులకు దుస్తుల పంపిణీకార్యక్రమంలో భాగంగా విద్యార్థుల పట్ల దాతృత్వాన్ని చాటుకుంటూ దివాకర్ అనే వ్యక్తి విద్యార్థులకు ఉచితంగా బట్టలు పంపిణీ చేశారు. ఈ వితరణను ఎంఈఓ మరియు ఉపాధ్యాయులు అభినందించారు.ఈ కార్యక్రమంలో గుత్తివారిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు భాస్కర్ రెడ్డి, మల్లవరం జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం వెంకటరమణ, వెదుళ్ల చెరువు ఎస్టీసీ మోడల్ ప్రైమరీ పాఠశాల హెచ్ఎం మేఘనాథ్, సిఆర్ఎంటి మునయ్య, పాఠశాల కమిటీ చైర్మన్, ఉపాధ్యాయులు మరియు విద్యా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## తిరుపతిలో రౌడీమూకల దౌర్జన్యం: సూరయ్యకట్టలో వృద్ధుడి ఇంటి కబ్జాకు యత్నం!..

### జనసేన నాయకుడినంటూ బెదిరింపులు

### అడ్డుకట్ట వేసి వృద్ధుడికి అండగా నిలిచిన సిపిఎం..

**తిరుపతి ఉత్తేజిత మే 16.**



తిరుపతి నగరం కపిలతీర్థం రోడ్డులోని సూరయ్యకట్ట ప్రాంతంలో ఒంటరి వృద్ధుడు తంగరాజు నివసిస్తున్న ఇంటిపై జరిగిన దౌర్జన్య ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. అద్దెకు ఉంటున్న రాజా నాగరత్నం మరియు అతని కుమారులు తాము "జనసేన నాయకులం" అని చెప్పుకుంటూ, సుమారు 20 మంది రౌడీలతో కలిసి వృద్ధుడిపై భౌతిక దాడికి దిగడం అమానుషం. ఎమ్మెల్యే పేరు అడ్డుపెట్టుకుని, మద్యం మత్తులో వృద్ధుడిని ఇంటి నుంచి బయటకు గెంటేసి తాళాలు వేయడం రాజకీయ రౌడీయిజానికి పరాకాష్టగా నిలిచింది.ఈ విషయం తెలుసుకున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు టి. సుబ్రహ్మణ్యం, నగర కార్యదర్శి కే. వేణుగోపాల్ బృందం శనివారం బాధితుడి ఇంటిని సందర్శించింది. దౌర్జన్యంగా వేసిన తాళాలను సిపిఎం నాయకులు స్వయంగా తొలగించి, వృద్ధుడిని తిరిగి తన ఇంటిలోకి ప్రవేశపెట్టారు. గత 30 ఏళ్లుగా అన్ని చట్టబద్ధమైన పత్రాలతో నివసిస్తున్న వ్యక్తిపై ఇలాంటి కబ్జా యత్నాలు చేయడం దుర్మార్గమని వారు మండిపడ్డారు.బాధితుడు పోలీసుల చుట్టూ తిరిగినా కేసులు నమోదు చేయకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిందితులపై తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని, జిల్లా ఎస్పీ గారు ఈ విషయంలో జోక్యం చేసుకుని బాధితుడికి న్యాయం చేయాలని సిపిఎం నేతలు డిమాండ్ చేశారు. న్యాయం జరిగే వరకు బాధితుడి పక్షాన పోరాటం కొనసాగిస్తామని వారు స్పష్టం చేశారు.

## పెట్రోల్ డీజిల్ ధరలు పెంచడం తో మోడీ మోసకారితనం రుజువయింది: సిపిఎం

**ఆత్మకూరు ఉత్తేజిత**



కొత్తపల్లి: ఐదు రాష్ట్రాలఎన్నికలకు ముందు పెట్రోల్ డీజిల్ ధరలు భారతదేశంలో పెరగవని చెప్పి ఎన్నికలు అయిపోయిన వెంటనే పెట్రోల్ డీజిల్ ధరలు పెంచడంతో మోడీ మోసకారితనం రుజువైందని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి యేసురత్నం కొత్తపల్లి మండల కార్యదర్శి ఎన్ స్వాములు ఆరోపించారు ప్రపంచంలోని అన్ని దేశాల్లో పెట్రోల్ ధరలు పెరుగుతుంటే మనదేశంలో పెట్రోల్ డీజిల్ పెరగలేదని ఈ దేశం బిజెపి వల్లనే అభివృద్ధి చెందుతుందని ఎన్నికల్లో ప్రచారం చేసి ఓట్లు దండుకున్న బీజేపీ ఏరు దాటక ముందు ఓడ మల్లన్న ఏడు దాటిన తర్వాత బోడి మల్లన్న అనే విధంగా ఎన్నికల అయిపోయిన మరుక్షణమే పెట్రోల్ పైన 3 రూపాయల 14 పైసలు డీజిల్ పైన 3 రూపాయల 11 పైసలు పెంచి కార్పొరేట్లకు దాసుడిని అనిరూపించుకున్నాడు అన్నారు ఇప్పటికే కమర్షియల్ గ్యాస్సిలిండర్ ధరను 3000 రూపాయలకు పైగా పెంచి బిజెపి ప్రభుత్వం మరోసారి పెట్రోల్ డీజిల్ ధరలను పెంచి దేశ ప్రజల పై ధరల భారం మోపి కార్పొరేట్లకు ప్రజల సొమ్మును దోచిపెడుతుందని ఆరోపించారు మోడీ ప్రధానమంత్రి అయిన తర్వాత మన దేశ కరెన్సీ డాలర్ తో మారకపు విలువ 95 రూపాయల 73 పైసలకు క్షీణించిందని ఇది మోడీ ప్రభుత్వం అసమర్థతకు నిదర్శనం అన్నారు ఇప్పటికే కాంప్లెక్స్ ఎరువుల ధరలు 300 రూపాయలు పెంచింది ఇప్పుడు పెట్రోల్ డీజిల్ ధరలు పెరగడం వల్ల ఎరువుల ధరలతో పాటు నిత్యవసర వస్తువుల ధరలు మరింత పెరిగే అవకాశం ఉందన్నారు ఇప్పటికైనా సబ్కా సాత్ సబ్కా వికాస్ అని చెబుతున్న నరేంద్ర మోడీ దేశ ప్రజలను మోసం చేయకుండా ప్రజలందరి సంక్షేమం కోరుకున్నట్లైతే పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలతో పాటు ఎరువుల ధరలను కూడా వెంటనే ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు

## 10వ తరగతిలో మంచి మార్కులు సాధించిన తమ స్నేహితుల పిల్లలను ఘనంగా సన్మానించిన జడ్పీహెచ్ 98-99 బ్యాచ్.

**ఆత్మకూరు ఉత్తేజిత**



పాములపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1998-99 బ్యాచ్ పూర్వ విద్యార్థులు తమ స్నేహితుల పిల్లలు పదో తరగతిలో మంచి మార్కులు సాధించిన సందర్భంగా ఘనంగా అభినందన సభ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్- శివలక్ష్మి రెడ్డి, శ్రీనివాసులు, మున్నా లు హాజరై విద్య యొక్క గొప్పతనం, చదువు ద్వారా జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకునే అవకాశాల గురించి విద్యార్థులకు ప్రేరణాత్మకంగా తెలియజేశారు.ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ తమ స్కూల్ బ్యాచ్ స్నేహితులు కలిసి విద్యార్థుల విజయాలను గుర్తించి అభినందించడం ఎంతో ఆదర్శప్రాయమని కొనియాడారు. సమాజంలో విద్యకు ప్రాధాన్యత పెంచే విధంగా ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని జరగాలని ఆకాంక్షించారు.అలాగే ఈ కార్యక్రమంలో ప్రత్యేకంగా పవన్ కుమార్ అనే విద్యార్థి గురించి ప్రస్తావించారు. అతను తల్లిదండ్రులు లేకున్నా ఎన్నో కష్టాలను ఎదుర్కొంటూ

## డెంగి వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి



**బేతంచెర్ల : ఉత్తేజిత ప్రతినిధి**

: డెంగి వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని బేతం చెర్ల,మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు డాక్టర్లు అబ్దుల్ ఆలీం,మూర్తుజవలి,అన్నారు.శనివారం జాతీయ డెంగు దినోత్సవం సందర్భంగా వైద్య సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు.ఇంటి పరిసరాలను నీటి నిలువ లేకుండా చూడాలని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.దోమ కాటు వల్ల మలేరియా డెంగి మెదడు వ్యాపు వ్యాధులు వస్తాయి అన్నారు.ప్రతి శుక్రవారం డ్రై డేపాటించాలన్నారు.ఈ కార్యక్రమంలోఈవోఆర్డి మల్లికార్జున,డిప్యూటీఎంపిడిఓ పరమేశ్వర రెడ్డి, పంచాయతీ కార్యదర్శి నాగప్రసాద్,సూపర్వైజర్ అబ్దుల్ గఫార్,రాజ్యలక్ష్మి,నరసింహారావు,హెల్త్ అసిస్టెంట్స్ రామాంజనేయులు,సుభాష్ బాబు, టెక్నీషియన్ సర్వేష్,ఏఎన్ఎం సుగుణ,ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## బేతంచెర్ల పట్టణాన్ని ప్లాస్టిక్ రహితంగా మార్చుదాం

**బేతంచెర్ల : ఉత్తేజిత ప్రతినిధి**



: పర్యావరణానికి పెను భూతంగా మారిన ప్లాస్టిక్ వాడకానికి ప్రతి ఒక్కరు స్వస్తి పలకాలని ఎంపీడీవో ఫజల్ రహిమాన్, పిలుపునిచ్చారు.స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలోభాగంగా కార్యక్రమంలో భాగంగా నగర పంచాయతీ కమిషనర్ హరి ప్రసాద్,ఆధ్వర్యంలోసచివాలయ సిబ్బంది పొదుపు మహిళలు పట్టణ పూరవీధులలో ర్యాలీ నిర్వహించారు.అనంతరం పాత బస్టాండులో పట్టణ పరిశుభ్రతకు సహకరిస్తూ ప్లాస్టిక్ నిర్మలనకు తోడ్పడుతామని ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలోఎంఈఓ 2 అబ్రహం,డాక్టర్ తస్లీమా,ఐసిడిఎస్ సూపర్వైజర్స్ రాధమ్మ,తిప్పమ్మ,శానిటరీ ఇన్స్పెక్టర్ మధు కుమార్,సచివాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక కార్యాచరణ అత్యవసరం !

నాలుగు రాష్ట్రాలఅసెంబ్లీ ఎన్నికలు ముగిశాక బిజెపిలో కనిపించినంత ఆనందం మిగతా పార్టీల్లో కనిపించలేదు. కేరళలో అధికారం దక్కించుకున్నా కూడా కాంగ్రెస్ లో అంతటి ఆనందం కనిపించలేదు. బెంగాల్ దక్కడంతో బిజెపిలో ఎక్కడలేని ఆనందం, ఉత్సాహం కనిపించింది. ఆ ఆనందాన్ని ప్రజలతో పంచుకునేందుకు బిజెపి సిద్ధంగా లేదు. ఎందుకంటే పెట్రో,డీజిల్ ధరలు పెంచడం, ఆర్థిక వ్యవస్థ రోజురోజుకూ కుదేలవ్వడంతో ప్రజల్లో ఒకింత నిరాసక్తి కనిపిస్తోంది. కొత్తగా రెండు రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలోకి వచ్చింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ ఆనందంలో ఉండగానే దేశ ఆర్థిక వ్యవస్థ తీవ్ర కష్టనష్టాల నెదుర్కొంటున్న వాస్తవాన్ని గుర్తించారు. హైదరాబాద్ పర్యటనలో ఆయన చేసిన వ్యాఖ్యలు రానున్న ముప్పును ముందే గమనించి చేసిన హెచ్చరికగా గుర్తించాలి. ఈ క్రమంలో ఒక్క బంగారం దిగుమతులే కాకుండా దేశీయ వ్యవసాయ రంగాన్ని దెబ్బతీస్తున్న ఆహార దిగుమతులను కూడా నిలిపి వేయడం మంచిదని ప్రధాని ఎంత త్వరగా గుర్తిస్తే అంత మంచిది. ఆర్థిక వ్యవస్థ రానున్న రోజుల్లో మరింత బలహీనం కానుందన్న కఠోర సత్యాన్ని మోడీ ఒప్పుకున్నారు. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు చేసిన తప్పులకు ప్రజలు త్యాగాలు చేయాలని ప్రధానమంత్రి పిలుసపునిస్తున్నట్లుగా ఉంది. అందువల్ల రాజకీయ నాయకులకు సంబంధించి విప్లవాత్మక మార్పులు తీసుకుని వస్తే తప్ప సంక్షోభాన్ని గట్టెక్కలేమని ప్రధాని మోడీ గుర్తించడం లేదు. ఇరాన్‌పై అమెరికా,ఇజ్రాయెల్ సంయుక్త దాడులతో మొదలు పెట్టిన యుద్ధం ప్రారంభమై ఈ నెలాఖరుకు మూడు నెలలు పూర్తవుతాయి. ఫిబ్రవరి 28న మొదలైన ఈ యుద్ధం ఇప్పట్లో ముగుస్తుందనడానికి లేదు. ట్రంప్ రోజుకో మాట మాట్లాడుతున్నారు. ఆయన తీరు చూస్తుంటే యుద్ధం ఆగిపోయే సూచనలు కానరావడం లేదు. పశ్చిమాసియాలోని దేశాలన్నీ ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఆ యుద్ధంలో పాల్గొంటూనే ఉన్నాయి. ఈ క్రమంలో చమురు సరఫరా నిలిచి పోయింది. హోర్ముజ్ జలసంధి వద్ద అమెరికా ,ఇరాన్‌లు పట్టుబిగించాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 107 డాలర్లుగా ఉన్నది; రూపాయి మారకం విలువ డాలర్‌కు రూ.96కు చేరువలో ఉన్నది. రూపాయి విలువ ఎన్నడూ ఇంతగా పతనం కాలేదు. నిత్యం దాని ధర పతనం అవుతూనే ఉంది. దీనికి కారణం ఇబబడిముబ్బడిగా దిగుమతులే కారణమని చెప్పనక్కరలేదు. విదేశీ మారక నిల్వలు తగ్గిపోతున్నాయి. అధికారికంగా వినియోగ ధరల సూచీ ద్రవ్యోల్బణం 3.5శాతం కాగా ఆహార ద్రవ్యోల్బణం 4.33శాతంగా ఉంది. గృహావసరాల ఎల్‌పీజీ సిలిండర్ ధర రూ.913 కాగా కమర్షియల్ సిలిండర్ ధర రూ.3077 నుంచి రూ.3237 దాకా ఉంటోంది; డబ్ల్యూపీఐ ద్రవ్యోల్బణం 8.3శాతంగా ఉంది. ఇవన్నీ కూడా మన ఆర్థిక దౌర్బల్యాన్ని సూచిస్తున్నాయి. నేరుగా ఇవన్నీ ప్రజలపై తీవ్ర ప్రభావం చూపుతున్నవని గుర్తించాలి. దీనిని తట్టుకుని నిలబడేందుకు ధరలు పెంచడం మార్గం కాదు. ప్రజల్లో కొనుగోలు శక్తి పెరగడానికి చర్యలు తీసుకోవడం లేదు. దేశీయంగా ఆహార వస్తువులను ప్రజలకు నేరుగా, చౌకగా అందించే ప్రణాళికలు చేయడం లేదు. తెలుగు రాష్ట్రాలను తీసుకుంటే ఇక్కడ వరి, మిర్చి, శనగ,మక్కజొన్న తదితర పంటలు విపరీతంగా పండుతున్నాయి. ఇవి పండిస్తున్న రైతులకు గిట్టుబాటు ధరలు దక్కడం లేదు. అలాగే కొనుగోలుదారులకు సరసమైన ధరలకు వస్తువులు దక్కడం లేదు. ఈ వ్యత్యాసాన్ని ప్రభుత్వాలు గుర్తించడం లేదు. బంగారం దిగుమతులను నిలిపివేయడంతో పాటే ఇతర నిత్యావసరాల దిగుమతులను కూడా నిలిపివేయాలి. దేశీయంగా పండుతునున్న పంటలకు పోటీగా వస్తున్న ఆహారా ధాన్యాల దగుమతులపై ఆంక్షలు విధించాలి. అలాగే మనవద్ద గోదాముల్లో మూలుగుతున్న ఆహార ధాన్యాలను ఉచితంగా కాకుండా ప్రజలకు సరసమైన ధరలకు అందించాలి. అలాగే అన్ని విషయాలలోను పొదుపు పాటించి తీరాలి. ఇంధన వినియోగం, వంటనూనెలు, ఎరువులు మొదలైన వాటి వినియోగంలో పొదుపు అవసరమే. అందుకోసం అనవసర దిగుమతులను పూర్తిగా నిరోధించాలి. అనన్నింటికి మించి ప్రజాప్రతినిధుల దుబారాలపై ఆంక్షలు విధించాలి. జీతభత్యాలు, ఉచిత పథకాలపైనా కొంతకాలం ఆంక్షలు విధించాలి. ఈ విషయంలో పాలకులు ముఖ్యంగా ప్రధాని మోడీ ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉంది. అడ్డూ అదుపూ లేకుండా ఇంధన వినియోగానికి కారణ మవుతున్న కాన్వాయ్‌లను రద్దు చేయాలి. దేశ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు విదేశీ మారకద్రవ్యం నిల్వలను మళ్లీ సమృద్ధం చేయడానికి కఠిన చర్యలు అవలంబించాల్సిందే. ఇవన్నీకూడా ఎమర్జెన్సీ కింద అమలు కావాలి. రూపాయి మారకం రేటును స్థిరీకరించకుంటే మన విదేశీమారక నిల్వలు హరించకు పోతాయి. అందుకోసం రూపాయి మారకం రేటు స్థిరపరచేందుకు అసవరమైన చర్యలను తక్షణం అమలు చేయాలి.

ఉత్తేజిత దినపత్రిక

# జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా ర్యాలీ...

**తిరుపతి స్టాఫ్ రిపోర్టర్ ఉత్తేజిత మే 16.**

మే 16 "జాతీయ డెంగ్యూ దినోత్సవం" సందర్భంగా తిరుపతి జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వి.బాలకృష్ణ నాయక్ అధ్యక్షతన జిల్లా మలేరియా అధికారి డాక్టర్ జీ.కే. రూప్ కుమార్ ఆధ్వర్యంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయం నుండి వేంకటేశ్వర వైద్య కళాశాల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు.ఈ ర్యాలీని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వి.బాల కృష్ణ నాయక్ జండా ఊపి ప్రారంభించారు. డెంగ్యూ వ్యతిరేక నినాదాలతో ర్యాలీ నిర్వహించి శ్రీ వేంకటేశ్వర వైద్య కళాశాల కూడలి వద్ద పద్మావతమ్మ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది మరియు విద్యార్థినులు " మానవహారం నిర్మించి నినాదాలు చేశారు. విద్యార్థినులు, సిబ్బంది మరియు జిల్లా అధికారులతో జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ



అధికారి డెంగ్యూ వ్యాధి నిర్మూలనకు ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా డి ఎం హెచ్ ఓ మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధి నిర్మూలన కొరకు అందరూ కలిసి కట్టుగా కృషి చేయాలని తెలిపారు. డెంగ్యూ వ్యాధిఈడిస్ ఈజిప్టై అనే దోమ కాటు వలన వస్తుందని, ఈ వ్యాధి వర్షాకాలంలో ఎక్కువగా వస్తుందని, ఈ వ్యాధి నియంత్రణకు ప్రజలందరూ ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని, ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, వాడి పడేసిన ప్లాస్టిక్ గ్లాసులు కొబ్బరి బోండాలు ప్లాస్టిక్ వస్తువులు ఇంటి పరిసరాల్లో లేకుండా చూసుకోవాలని, దోమలు కుట్టకుండా చూసుకోవాలని, ఇంటి కిటికీలకు జాలీలు ఏర్పాటు చేసుకోవాలని,దోమల బ్యాట్లు రిపలెంట్లు వాడాలని,పరిసరాల పరిశుభ్రత పాటించాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి డాక్టర్ రూప్ కుమార్ , డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి, డిపిఎమ్ఓ డాక్టర్ చత్ర ప్రకాష్ రెడ్డి, ఎన్ సి డి ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రెడ్డి ప్రసాద్, స్టాటిస్టికల్ ఆఫీసర్ నాగేంద్ర కుమార్, డిప్యూటీ డెమో బలరామరాజు, జిల్లా ప్రోగ్రాం అధికారులు, మలేరియా సబ్ యూనిట్ అధికారులు, ఎం పి హెచ్ ఈ ఓ లు,పర్యవేక్షకులు, ఆరోగ్య కార్యకర్తలు,( మగ, ఆడ), కార్యాలయ సిబ్బంది, మరియు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. ?

## రేణిగుంటలో పోలీస్ వర్సెస్ జర్నలిస్ట్స్ మైత్రి క్రికెట్ మ్యాచ్: జెర్సీలను బహూకరించిన డిఎస్పి శ్రీనివాసరావు...

**రేణిగుంట ఉత్తేజిత మే 16.**




పోలీస్ శాఖకు, జర్నలిస్టులకు మధ్య సత్సంబంధాలు పెంపొందించేందుకు, శారీరక దారుఢ్యం మరియు ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు రేణిగుంటలో ఒక ప్రత్యేక మైత్రి క్రికెట్ మ్యాచ్‌ను నిర్వహించనున్నట్లు రేణిగుంట సబ్ డివిజనల్ డిఎస్పి టి. శ్రీనివాసరావు తెలిపారు.ఆయన తెలిపిన వివరాల ప్రకారం... మే 17వ తేదీ (ఆదివారం) ఉదయం 6:00 గంటలకు స్థానిక కేఎల్ఎమ్ స్కూల్ గ్రౌండ్‌లో ఈ క్రికెట్ మ్యాచ్ ప్రారంభం కానుంది. రేణిగుంట పోలీస్ సబ్ డివిజన్ జట్టుకు, రేణిగుంట పరిధిలోని రెండు జర్నలిస్ట్ అసోసియేషన్ల ఉమ్మడి జట్టుకు మధ్య ఈ పోటీ జరగనుంది.క్రీడాకారులకు జెర్సీల పంపిణీ:ఈ మ్యాచ్‌ను పురస్కరించుకుని రేణిగుంట డిఎస్పి కార్యాలయంలో శనివారం ఒక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా క్రికెట్ మ్యాచ్‌లో పాల్గొనే పోలీస్ జట్టుకు, జర్నలిస్టుల జట్టుకు ప్రత్యేక క్రీడా దుస్తులను (జెర్సీలను) డిఎస్పి శ్రీనివాసరావు తన చేతుల మీదుగా బహూకరించారు.
?ఈ సందర్భంగా డిఎస్పి శ్రీనివాసరావు మాట్లాడుతూ:
?"ఈ మ్యాచ్ ముఖ్య ఉద్దేశం పోలీస్ సిబ్బంది, జర్నలిస్టుల మధ్య ఒక స్నేహపూర్వక వాతావరణాన్ని సృష్టించడం. అలాగే నిరంతరం ఒత్తిడితో కూడిన విధుల్లో ఉండే అందరికీ ఆరోగ్యం పట్ల అప్రమత్తత కల్పించడం మరియు క్రీడల ప్రాముఖ్యతను తెలియజేయడమే ఈ కార్యక్రమ లక్ష్యం."మ్యాచ్‌ను తిలకించాల్సిందిగా ఆహ్వానం:రేపు ఆదివారం ఉదయం జరగబోయే ఈ మైత్రి క్రికెట్ మ్యాచ్‌కు రెండు జర్నలిస్ట్ యూనియన్ల ప్రెసిడెంట్లు, సెక్రటరీలు మరియు యూనియన్ సభ్యులందరూ విచ్చేసి, మ్యాచ్‌ను తిలకించి క్రీడాకారులను ఉత్సాహపరచాలని డిఎస్పి శ్రీనివాసరావు కోరారు.డిఎస్పి కి ధన్యవాదాలు:క్రీడలను ప్రోత్సహిస్తూ తమకు జెర్సీలను అందజేసిన డిఎస్పి శ్రీనివాసరావు కి రేణిగుంట సీఐ జయచంద్ర, గాజులమాండ్యం సీఐ మంజునాథ్ రెడ్డి, పోలీస్ సిబ్బంది మరియు జర్నలిస్ట్ అసోసియేషన్ ప్రతినిధులు ప్రత్యేక కృతజ్ఞతలు మరియు ధన్యవాదాలు తెలియజేశారు.
?ఈ మైత్రి మ్యాచ్‌ను రేణిగుంట సీఐ జయచంద్ర, గాజులమాండ్యం సీఐ మంజునాథ్ రెడ్డిల ప్రత్యేక సహకారం, ఆధ్వర్యంలో మరియు రేణిగుంట జర్నలిస్టుల సమన్వయంతో ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

## పాముకాటుకు గురైన శ్రామికురాలు జి.రమణమ్మ ను పరమర్శించిన ఎంపీడీవో ఎన్.చంద్రశేఖర్, ఏపీఓ

**ఆత్మకూరు ఉత్తేజిత**

పాములపాడు మండల కేంద్రమైన పాములపాడులో, భవనాసి వాగులో ఉపాధి హామీ పనిచేస్తూ పాము కాటుకు గురైన శ్రామికురాలు గ్రంధివేముల.రవణమ్మ, భర్త వెంకటస్వామి ల ఇంటి దగ్గరకు ఎంపీడీవో- ఎన్.చంద్రశేఖర్, ఏపీవో- బి.జయంతి, డివిఎంసి మెంబర్ లింగాల నాగరాజు, ఈసీ, టీఏలు, ఎఫ్ఎ లు వెళ్లి పరామర్శించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ ఉపాధి హామీ పథకం నందు (మేజర్ కెనాల్) భవనాసి వాగులో పూడికతీత పనులుచేస్తుండగా వర్క్ ఐడి 507269 నందు జాబ్ కార్డు నెంబర్ 10063 నందు జి.రవణమ్మ, భర్త జి.వెంకటస్వామి గల శ్రామికురాలికి పాముకాటు వేయడం జరిగింది. ఆమెకు తక్షణమే ప్రాథమిక చికిత్స అందించడం జరిగిందన్నారు. ప్రస్తుతము ఆమెకు



ఎటువంటి ప్రమాదం లేదని త్వరగా కోలుకుంటుందని అన్నారు. ఆమెకు, కుటుంబ సభ్యులకు ధైర్యంగా ఉండాలని, ఏమి కాదు అని, ఏమైనా అవసరమైతే మెరుగైన వైద్యము అందిస్తామని అన్నారు. కనుక మండలంలోని, అన్ని గ్రామాలలో పనిచేస్తున్న ఉపాధి హామీ శ్రామికులు విష సర్పాల బారిన పడకుండా, ఎటువంటి ప్రమాదాలకు గురి కాకుండా జాగ్రత్తగా పనులు చేయాలని సూచనలు, సలహాలు ఇచ్చారు. ఏదైనా అనుకోకుండా ఎటువంటి ప్రమాదాలు జరిగినా కూడా ప్రభుత్వం నుండి ఇన్సూరెన్స్ వచ్చే విధంగా చూస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ సిబ్బంది ఈసీ ఎం.గౌస్, టి.ఏ లు స్వాములు, ఫయాజ్, శ్రీకాంత్ ఫీల్డ్ అసిస్టెంట్ జె.లింగస్వామి, ఉపాధి హామీ మెట్లు, కూలీలు పాల్గొనడం జరిగింది.

# నల్ల కాల్వలో శక్తి యాప్ అవేర్నెస్ ప్రోగ్రాం

**ఆత్మకూరు ఉత్తేజిత**

శక్తి టీం సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ షేక్ నూర్ అహ్మద్ మరియు డబ్ల్యూ హెచ్ జి. సుప్రియ.నంద్యాల జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, ఆత్మకూరు డిఎస్పీ రామాంజి నాయక్ ఉత్తర్వుల మేరకు ఆత్మకూరు సిఐ మనోహర్ తో పంచాయతీ సెక్రెటరీ బాలు నాయక్ మరియు నల్లకాల్వ ఫీల్డ్ అసిస్టెంట్ మద్దమ్మ ఆధ్వర్యంలో ఆత్మకూరు ఖూరా పరిధిలోని నల్లకాల్వ గ్రామం నుండి రుద్రకోడూరు కు పోయే దారిలో ఉపాధి హామీ పథకం లో భాగంగా జరుగుచున్న కరువు పనికి వచ్చిన సుమారు 150 మహిళలకు మరియు అక్కడికి వచ్చిన వారికి " శక్తీ యాప్ " అవేర్నెస్ ప్రోగ్రాము లో భాగంగా మహిళల రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన " శక్తి యాప్ " గురించి మరియు శక్తి యాప్ వాట్సాప్ నంబర్ 7993485111 గురించి తెలుపుతూ, మహిళల రక్షణకై ఏర్పాటు చేసిన పోక్సో చట్టం గురించి బాల్యవివాహాలు, చిన్న పిల్లలపై నేరాలు జరగకుండా ఆపుటకు 1098 ఫిర్యాదు చేయవలెనని, ఉమన్ వెల్ఫేర్ 181, ఎమర్జెన్సీ కాల్ 112, 100 కి ఫోన్ చేయవలెనని, సైబర్ క్రైమ్ జరిగినచో టోల్ ఫ్రీ




నెంబర్ 1930 కి ఫోన్ చేయవలెనని, ఫేక్ కాల్స్,ఖజానా ఫైల్స్ లాంటివి ఏదన్నా మీ వాట్స్ అప్ లో పంపితే వాటిని ఓపెన్ చేయొద్దు అని తెలుపుతూ వాటి ద్వారా వారికీ జేరిగే ఆర్థిక నష్టాలను గురించి కూడా తెలిపి,వన్ స్టాప్ సెంటర్ యొక్క ప్రాముఖ్యతను గురించి శక్తి టీమ్ సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ నూర్ అహ్మద్ డబ్ల్యూ హెచ్ జి. సుప్రియ వివరించడం జరిగింది. అలాగే అవేర్నెస్ ప్రోగ్రాములో పాల్గొన్న అందరు వారి యొక్క ఆండ్రాయిడ్ మొబైల్స్ నందు శక్తి యాప్ డౌన్లోడ్ చేసుకొని, ఆపద సమయం లో ఎలా ఉపయోగించుకోవాలో తెలుపుతూ అవేర్నెస్ కలిపిస్తూ ప్రోగ్రాము చేయడం జరిగినది, స్కూళ్లకు కాలేజీలకు పిల్లలకు సెలవులు ఉన్న కారణంగా పిల్లలు బావులలో చెరువులలో ఈత కొట్టడానికి పోకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా సూచించడం అయినది. అదేవిధంగా మీ, మీ ఇంట్లోని మగవారు వారి మోటార్ సైకిళ్లను నడిపేటప్పుడు ఖచ్చితంగా తలకు హెల్మెట్ పెట్టుకొని ప్రయాణం చేసే లాగా చెప్పమని చెప్తూ ఏదైనా అనుకోకుండా యాక్సిడెంట్లు జరిగితే తలకు దెబ్బలు తగలడం వల్లనే నూటికి 90 శాతం మంది చనిపోవడం జరుగుతుంది కాబట్టి ప్రతి ఒక్కరు కచ్చితంగా తలకు హెల్మెట్ ధరించమని తెలిపారు. అదేవిధంగా అక్కడికి వచ్చిన మగవారికి ఎవరు కూడా మధ్యం తాగి వాహనాలు నడపవద్దని తెలుపుతూ అట్లా తాగి వాహనాలు నడిపితే 10 వేల రూపాయలు ఫైన్ లేదా జైలు శిక్ష ను కోర్టు వారు విధిస్తారు అని తెలుపుతూ శక్తి టీం సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ నూర్ అహ్మద్ డబ్ల్యూ హెచ్ జి. సుప్రియ అవేర్నెస్ కలిగించడం జరిగింది.

# శ్రీకాళహస్తిలో శని జయంతి వేడుకలు...

**శ్రీకాళహస్తి ఉత్తేజిత మే 16.**

పరమ పవిత్రమైన శని జయంతి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీకాళహస్తి శాసనసభ్యుడు బొజ్జల సుధీర్ రెడ్డి శనివారం తన కుటుంబ సభ్యులతో కలిసి శ్రీకాళహస్తి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలో వెలసిన శనీశ్వర స్వామి అభిషేక మహోత్సవంలో ఎమ్మెల్యే దంపతులు మరియు కుటుంబ సభ్యులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీ కాళహస్తీశ్వర స్వామివార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ వేద పండితులు ఎమ్మెల్యేకు వేదాశీర్వచనాలు అందించి, స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.ప్రజా క్షేమమే ప్రథమ ప్రాధాన్యత:
దర్శనానంతరం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి



మాట్లాడుతూ.. శని జయంతి వంటి విశిష్ట రోజున స్వామివార్లను దర్శించుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. శ్రీకాళహస్తీశ్వర స్వామి మరియు అమ్మవార్ల దివ్య ఆశీస్సులు శ్రీకాళహస్తి నియోజకవర్గ ప్రజలపై, అలాగే రాష్ట్ర ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని, అందరూ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా ప్రార్థించినట్లు పేర్కొన్నారు.
?క్షేత్రస్థాయిలో వసతుల పరిశీలన:
దర్శనం అనంతరం భక్తుల సౌకర్యార్థం ఆలయంలో ఏర్పాటు చేసిన వివిధ విభాగాలను ఎమ్మెల్యే స్వయంగా పరిశీలించారు. ఆలయ ప్రసాదం కౌంటర్లు, భక్తులు వేచి ఉండే క్యూ లైన్లు మరియు ఆన్‌లైన్ సిస్టమ్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. సుదూర ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, దర్శనం సులభంగా జరిగేలా చూడాలని అధికారులకు సూచించారు.
?భక్తులతో నేరుగా ముఖాముఖి:
ఆలయ ప్రాంగణంలో ఉన్న భక్తులతో ఎమ్మెల్యే నేరుగా మాట్లాడి వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రసాదాల నాణ్యత, ఇతర వసతులపై భక్తులకు ఉన్న సమస్యలను అడిగారు.

## రైతులకు గడ్డి విత్తనాలను పంపిణీ చేసిన పశు వైద్యాధికారి పి.భాస్కర్

**ఆత్మకూరు ఉత్తేజిత**
**పాములపాడు:**



లాభసాటిగా మార్చేందుకు రైతులకు మేలైన పశుగ్రాస విత్తనాలను 75 శాతం రాయితీతో రైతు సేవా కేంద్రాలు, పశు వైద్య కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్నట్లు పాములపాడు పశు వైద్యశాల డాక్టర్ పి.భాస్కర్ తెలిపారు.
శుక్రవారం పాములపాడులోని, పశువైద్య కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో రైతులకు గడ్డి విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెటర్నరీ డాక్టర్ భాస్కర్ మాట్లాడుతూ ప్రస్తుతం స్థానికంగా ఎక్కువగా డిమాండ్ ఉన్న సిఎస్ హెచ్-24 జొన్న రకం, ఆఫ్రికన్ టాల్ మొక్కజొన్న విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచామన్నారు.
సిఎస్ హెచ్-24 జొన్న 5 కిలోల ప్యాకెట్ అసలు ధర రూ.460 కాగా, ప్రభుత్వం సబ్సిడీ రూ.345 పోను రైతు రూ. 115 చెల్లిస్తే సరిపోతుందని చెప్పారు.
మొక్కజొన్న 5 కిలోల ప్యాకెట్ విలువ రూ.340 ఉండగా, రూ.255 సబ్సిడీ పోను రైతు రూ.85 చెల్లిస్తే సరిపోతుందని చెప్పారు.
రైతు తమ పొలంలో కనీసం 10 శాతం మేర పశుగ్రాసాన్ని సాగు చేయాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో పశు వైద్యశాల సిబ్బంది తిరుమలేశ్, కవిత, రైతులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గిద్దాం -- పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలి

**:జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్**

**తిరుపతి, ఉత్తేజిత స్టాఫ్ రిపోర్టర్ మే 16:**



పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ వినియోగాన్ని గణనీయంగా తగ్గించేందుకు ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు.
శనివారం ఉదయం ఏర్పేడు బస్టాండు కూడలిలో మండలంలో నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర -- స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని ప్రతిజ్ఞ చేసి ప్రజలకు, స్థానిక అధికారులకు పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ సంచులు, ఒకసారి వినియోగించి పారేసే ప్లాస్టిక్ వస్తువులు, ప్లాస్టిక్ వాటర్ బాటిళ్ల వినియోగం పర్యావరణానికి తీవ్ర హానికరమని తెలిపారు. ప్లాస్టిక్ వ్యర్థాల కారణంగా భూమి, నీరు, గాలి కాలుష్యం పెరిగి ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతోందన్నారు. పర్యావరణ హిత జీవనశైలిని అలవాటు చేసుకోవాలని సూచిస్తూ గుడ్డ సంచులు, జూట్ బ్యాగులు, పునర్వినియోగ వస్తువులను వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలకు సూచించారు. ఇంటి వద్ద నుంచే చెత్త వేర్వేరుగా వర్గీకరించి ప్లాస్టిక్ వ్యర్థాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చెత్త బుట్టల్లో వేయాలని తెలిపారు.జిల్లా వ్యాప్తంగా స్వచ్ఛ ఆంధ్ర -- స్వచ్ఛ తిరుపతి కార్యక్రమాన్ని విస్తృత స్థాయిలో నిర్వహిస్తూ ప్రజల్లో పరిశుభ్రత, ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, భవిష్యత్ తరాలకు పరిశుభ్రమైన పర్యావరణాన్ని అందించేందుకు అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఆర్డీఓ భానుప్రకాష్ రెడ్డి, తహసీల్దార్, ఎంపిడిఓ, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది మరియు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఐఐటి తిరుపతి సమక్షంలో ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ యువ సంఘం-6 కార్యక్రమం ప్రారంభం




**ఏర్పేడు, ఉత్తేజిత మే 16:**

కేంద్ర ప్రభుత్వం ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 6 రోజుల పాటు ఏక్ భారత్ శ్రేష్ట భారత్ యువ సంఘం-6 కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని, ఈ కార్యక్రమాన్ని తిరుపతి ఐఐటి కళాశాల ఆధ్వర్యంలో చేపట్టడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ పేర్కొన్నారు. శనివారం ఏర్పేడులోని తిరుపతి ఐఐటి కళాశాలలో ఏక్ భారత్ శ్రేష్ట భారత్ యువ సంఘం-6 కార్యక్రమాన్ని కళాశాల డైరెక్టర్ డా.ఏ. సత్యనారాయణతో కలసి జిల్లా కలెక్టర్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు సంపూర్ణ అనుభవం ఇవ్వాలనే ఉద్దేశ్యంతో ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ లో భాగంగా యువ సంఘం ఆరు రోజుల కార్యక్రమాన్ని తిరుపతి ఐఐటీ ఆధ్వర్యం లో ప్రారంభించుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మహారాష్ట్రకు చెందిన సుమారు యాభై మంది గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు పాల్గొంటున్నారన్నారు. కార్యక్రమంలో భాగంగా వారం రోజుల పాటు తిరుపతి జిల్లాలోని వివిధ విశేష ప్రాచుర్యం కలిగిన ప్రదేశాలైన తిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయం, శ్రీకాళహస్తి దేవాలయాలతో పాటు శ్రీ సిటీ పారిశ్రామిక కేంద్రం, శ్రీహరికోట రాకెట్ ప్రయోగ కేంద్రం, తిరుపతి ఎస్వి, మహిళా విశ్వవిద్యాలయాలను సందర్శిస్తారన్నారు. విశ్వవిద్యాలయాల సందర్శనలో భాగంగా ఇక్కడి అభివృద్ధి, విద్యా వ్యవస్థ, సంస్కృతి మొదలగు విషయాల పై పరస్పర అవగాహన పెంచుకునే అవకాశం కలుగుతుందన్నారు. వీటితో పాటు అదనంగా రెండు రోజులు అమరావతికి తీసుకువెళ్ళి రాజధాని ప్రాంతంలోని అభివృద్ధి పనులు, విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ నిర్మాణాలు ఎలా ఉన్నాయో కూడా వీరికి చూపించబడుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం నిధులు సమకూరుస్తూ ప్రతి ఏడూ నిర్వహిస్తున్న నేపథ్యంలో ఈ సంవత్సరం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అందులోనూ తిరుపతి ఐఐటి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించుకోవడం మంచి అవకాశంగా భావిస్తున్నామన్నారు. ఐఐటి తిరుపతి డైరెక్టర్ మాట్లాడుతూ రెండు సంవత్సరాల క్రితం తిరుపతి ఐఐటి ఆధ్వర్యంలో యూత్ ఇంటిగ్రేషన్ ప్రోగ్రామ్ నిర్వహించడం జరిగిందని, ఆ సమయంలో ఐఐటి అరుణాచల్ ప్రదేశ్ నుండి విద్యార్థులతో ఈ కార్యమరమ్యం నిర్వహించడం జరిగిందని, ప్రస్తుతం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం మహారాష్ట్ర నుండి వచ్చిన సుమారు 50 మంది విద్యార్థులతో నిర్వహించడం జరుగుతుందన్నారు. భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి సుమారు 50 మంది విద్యార్థులను ఎంపిక చేసి జూన్ మొదటి వారంలో మహారాష్ట్ర తీసుకువెళ్ళడం జరుగుతుందన్నారు. దేశం నలుమూలల విద్యా వ్యవస్థ, సంస్కృతి, పరిశ్రమలు, అభివృద్ధి తదితర అంశాల పై సమగ్ర అవగాహన కల్పించడమే ధ్యేయంగా భారత ప్రధాని నరేంద్ర మోడి ఈ కార్యక్రమాన్ని రూపొందించారన్నారు. ఇందులో భాగంగా విద్యార్థులకు తిరుపతి పరిసర ప్రాంతాల్లోని ఆధ్యాత్మిక, పారిశ్రామిక, విద్యా కేంద్రాలు చూపించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐఐటి విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తేజిత దినపత్రిక



# ట్రంప్ కుంపటితో ఆర్థిక రంగం కుదేలు!



**ఇరాన్‌పై దాడితో ప్రపంచ దేశాలను ప్రమాదంలో పడేసిన ట్రంప్ ఇంకా మేల్కొనలేదు. తనవల్ల ప్రపంచం అతలాకుతలం అయ్యిందే అన్న కించిత్ చింతన కూడా కానరావడం లేదు. పైపెచ్చు..ఇరాన్‌ను భూమండలం మీద లేకుండా చేస్తామని కూడా ప్రకటించారు. ఇరాన్ సంగతి ఎలా ఉన్నా...భారత్ లాంటి దేశాలు చమురు ధరలతో విలవిల్లాడుతున్నాయి. ఆర్థిక సంక్షోభం తప్పేట్లుగా లేదు. చమురు రవాణా ఆగిపోవడంతో పాటు, ముడి చమురు ధరలు పెరగడంతో నానాయాతన పడాల్సి వస్తోంది. తాజాగా భారత్‌లో పెట్రీ, డీజిల్ దలరు పెరిగాయి. ఈ పెరుగుదల ఒక్క ఇంధనంపైనే ఉండదు. ఇకనుంచి అన్నిరంగాల పై దీని ప్రభావం పడుతుంది. నిత్యావసర ధరలు ఆకాశాన్ని అంటుతాయి. విమానయాన రంగం ఇప్పటికే గగనకుసుమమైంది. ఇది మరింత ప్రమాదంలో పడనుంది. వెరసి సామాన్యుల బతుకులు భారం కానున్నాయి.**

పొదుపు మంత్రం ప్రకటించిన ప్రధాని మోడీ కాన్వాయ్‌లను తగ్గించారే తప్ప, అసలు పొదుపు విషయంలో మాట్లాడడం లేదు. దేశంలో ప్రజాప్రతినిధుల దుబారాను తగ్గించే ప్రయత్నాలపై ఎవ్వరు కూడా మాట్లాడడం లేదు. దీనికితో తోడు ఈ సంక్షోభం దృష్ట్యా ఐటి కంపెనీల్లో ఉద్యోగాల కోతలు మొదలయ్యాయి. రిక్రూట్‌మెంట్లు తగ్గాయి. ప్రధాని మోడీ ఇచ్చిన వర్క్‌ఫ్రమ్ హోమ్ విధానం అమలు సాధ్యమయ్యేలా కనిపించడం లేదు. కరోనా సమయంలో విధిలేక ఆఫీసులు మూసుకున్న ఐటి కంపెనీలు ఇప్పుడు ఉద్యోగులను వర్క్‌ఫ్రమ్ హోమ్‌కు పరిమితం చేయదల్చుకోలేదు. దేశంలో పెరుగుతున్న ఇంధన వినియోగాన్ని తగ్గించి, ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే దిశగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఒక కీలక ప్రతిపాదనను ముందుకు తీసుకువచ్చారు. ఉద్యోగులు వీలైనంత వరకు ఇంటి నుండే పని చేసే విధానాన్ని పాటించాలని ఆయన సూచించారు. ఈ నేపథ్యంలో, దేశీయ ఐటీ హబ్‌లలో ఒకటైన హైదరాబాద్‌పై ఈ నిర్ణయం ఎలాంటి ప్రభావం చూపుతుందనే అంశంపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. హైదరాబాద్ నగరంలో ప్రస్తుతం సుమారు 9 లక్షల మంది ఐటీ ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరిలో మెజారిటీ ఉద్యోగులు తమ కార్యాలయాలకు చేరుకోవడానికి ప్రతిరోజూ సగటున 50 కిలోమీటర్ల మేర ప్రయాణిస్తున్నారు. ఈ సుదీర్ఘ ప్రయాణం వల్ల అటు ట్రాఫిక్ సమస్యలు పెరగడమే కాకుండా, భారీగా ఇంధనం ఖర్చవుతోంది. ప్రధాని సూచన మేరకు వర్క్ ఫ్రమ్ హోమ్ విధానాన్ని అమలు చేస్తే ఈ సమస్యకు పరిష్కారం దొరుకుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. హైదరాబాద్ ఐటీ రంగంలో ఈ విధానం వల్ల కలిగే ఆర్థిక ప్రయోజనాలపై ప్రాథమిక అంచనాలు వెలువడ్డాయి.

నగరంలోని మొత్తం ఐటీ ఉద్యోగులలో కనీసం సగం మంది, అంటే సుమారు 4.5 లక్షల మంది వారానికి కేవలం మూడు రోజులు ఇంటి నుండి పని చేసినా అద్భుతమైన ఫలితాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఇలా చేయడం వల్ల నెలకు దాదాపు 140 కోట్ల రూపాయల విలువైన ఇంధనం ఆదా అయ్యే అవకాశం ఉందని అంచనా. ఇది దేశీయ ఆర్థిక వ్యవస్థకు పెద్ద ఊరటనిస్తుందని భావిస్తున్నారు. ఇలా ఒక్కో నగరాన్ని తీసుకుంటే గణనీయమైన మార్పులు ఉంటాయని అంటున్నారు. కోవిడ్ సమయంలో వర్క్ ఫ్రమ్ హోమ్ విధానం విజయవంతంగా అమలు జరిగినప్పటికీ, ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఐటీ కంపెనీలు ఈ విషయంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నాయి. పెద్ద కంపెనీలు ప్రభుత్వ నిర్ణయం కోసం వేచి చూస్తుండగా, కొన్ని చిన్న స్థాయి సంస్థలు మాత్రం ఈ విధానం వల్ల తమ ఉత్పాదకత దెబ్బతింటుందని లేదా ఇతర నష్టాలు వస్తాయని ఆందోళన చెందుతున్నాయి. ప్రభుత్వం నుండి స్పష్టమైన మార్గదర్శకాలు వస్తే తప్ప ఈ విషయంలో క్లారిటీ వచ్చేలా లేదు. కేవలం వర్క్ ఫ్రమ్ హోమ్ మాత్రమే కాకుండా, పెట్రోల్ , డీజిల్ వాహనాల స్థానంలో ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించడం కూడా అత్యవసరమని నిపుణులు సూచిస్తున్నారు. ఇంటి నుండే పని చేయడం వల్ల ఇంధన దిగుమతులు తగ్గి, అంతర్జాతీయ మార్కెట్‌లో భారత రూపాయి విలువ పెరగడానికి తోడ్పడుతుందని వారు అభిప్రాయపడుతున్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు దేశ ఆర్థిక భవిష్యత్తుకు ఈ 'వర్క్ ఫ్రమ్ హోమ్' విధానం ఒక కీలక మలుపు కానుంది. ఇకపోతే ఆర్థిక సంక్షోభం కారణంగా అనేక ఐటి కంపెనీలు కుదింపు మోజులో పడ్డాయి. ఎడాపెడా ఉద్యోగులను తొలగిస్తున్నాయి. గత నెలలో ప్రపంచవ్యాప్తంగా 30,000 మంది ఉద్యోగులను తొలగించిన అంతర్జాతీయ టెక్నాలజీ కంపెనీ ఒరాకిల్.. తాజాగా మరో షాకిచ్చింది.

నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్‌ఐటీ), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) వంటి పలు ప్రముఖ ఇంజనీరింగ్ కాలేజీల్లో క్యాంపస్ ప్లేస్‌మెంట్ పక్రియ ద్వారా విద్యార్థులకు జారీ చేసిన జాబ్ ఆఫర్ లెటర్లను, ప్రీ-ప్లేసమెంట్ ఆఫర్ల (పీపీఓ)ను కంపెనీ రద్దు చేసింది. ఒరాకిల్ తాజా నిర్ణయంతో ప్రభావితమైన కాలేజీల్లో ఎన్‌ఐటీ వరంగల్, వీఎన్‌ఐటీ నాగ్‌పూర్, ఐఐటీ హైదరాబాద్, ఐఐటీ రూర్కీ, ఐఐటీ బీహెచ్‌యూ కూడా ఉన్నాయి. ఆఫర్ లెటర్ల రద్దు విషయాన్ని కంపెనీ ఈ వారంలోనే విద్యార్థులకు వెల్లడించింది. దాంతో వారు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఎందుకంటే, చాలావరకు ఇంజనీరింగ్ కాలేజీలు ప్రాంగణ నియామకాల విషయంలో ఒక విద్యార్థి- ఒక ఉద్యోగం విధానాన్ని అనుసరిస్తున్నాయి. అంటే, క్యాంపస్ రిక్రూట్‌మెంట్ పక్రియలో ఒక కంపెనీ నుంచి జాబ్ ఆఫర్ అందుకున్న విద్యార్థికి ఇతర కంపెనీల ఆఫర్లను దక్కించుకునే అవకాశం ఉండదు. దాంతో ఒరాకిల్ ఆఫర్ కోల్పోయిన వారిప్పుడు కొత్త ఉద్యోగం కోసం అన్వేషించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అమెరికన్ టెక్నాలజీ దిగ్గజాల్లో ఒకటైన సిస్కో కూడా భారీగా ఉద్యోగాల కోతకు సిద్ధమైంది. వ్యాపార పునర్వ్యవస్థీకరణలో భాగంగా సిబ్బంది సంఖ్యను దాదాపు 4,000 మేర తగ్గించుకునే ఆలోచనలో ఉన్నట్లు సంస్థ ప్రకటించింది. ఈ విషయాన్ని ప్రభావిత సిబ్బందికి నేరుగా తెలియజేయడం జరుగుతుందని కంపెనీ పేర్కొంది. సిస్కో కూడా తన పెట్టుబడులను కృత్రిమ మేధ (ఏఐ)తో పాటు వేగం గా వృద్ధి చెందుతున్న ఇతర విభాగాల వైపు పెట్టుబడులను మళ్లించే ప్రయత్నాల్లో ఉంది. మైక్రోసాఫ్ట్‌పరమైన వృత్తి నిపుణుల సోషల్ నెట్‌వర్కింగ్ లింక్డ్‌ఇన్ సైతం ఉద్యోగులను తగ్గించుకునే ప్రయత్నాల్లో ఉన్నట్లు తెలిసింది. వృద్ధి చెందుతున్న విభాగాలపై దృష్టిపెట్టేందుకు సిబ్బంది పునర్వ్యవస్థీకరించాలను కుంటున్న కంపెనీ.. అందులో భాగంగా 5 శాతం ఉద్యోగాలకు కోత పెట్టాలనుకుంటోందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. లింక్డ్‌ఇన్‌లో ప్రపంచవ్యాప్తంగా 17,500 ఉద్యోగులు పనిచేస్తున్నారు. మొత్తంగా ట్రంప్ పెట్టిన కుంపటి ఇప్పట్లో చల్లారేలా లేదు. ప్రపంచ ఆర్థిక స్థితిని ఎంతగా దిగజారుస్తుందో ఇప్పుడే చెప్పలేం. భారత్ ఆర్థిక వ్యవస్థపై మాత్రం తీవ్ర ప్రభావం పడడం ఖాయమని చెప్పవచ్చు.

# గతేడాది కూడా నీట్ ప్రశ్నాపత్రం లీక్

- లీక్ పేపర్లతో ప్రభుత్వ వైద్య కళాశాల్లో సీట్లు
- టెన్త్. ఇంటర్‌లో అత్తెసరు మార్కులు వచ్చినా నీట్‌లో హవా
- గతేడాది లీక్ ఆనవాళ్లపై దృష్టి సారించిన సీబీఐ



**న్యూఢిల్లీ, మే 15 :** నీట్ 2026 పరీక్ష పత్రం లీకేజీపై దృష్టిపెట్టిన అధికారులకు గతేడాది లీక్ ఆనవాళ్లు బయట పడుతున్నాయి. కీలక నిందితుడైన వికాస్ బివాల్ గతేడాది యశ్ యాదవ్ నుంచి నీట్ ప్రశ్నపత్రం కొనుగోలు చేసినట్లు సీబీఐ అనుమానిస్తుంది. దీంతో ఈ యేడాది కూడా యశ్ నుంచే వికాస్ ఈ పేపర్‌ను కొన్నాడు. ఈ వ్యవహారంలో యశ్ తండ్రి మంగిలాల్ బివాల్, అంకుల్ దినేశ్ బివాల్ హస్తం కూడా ఉన్నట్లు తెలుస్తోంది. వికాస్ అతడి సోదరిలు ప్రగతి, కజిన్స్ సానియా, గుంజన్, పలాక్‌లు కూడా గతేడాది వైద్యవిద్య సీట్లు పొందారు. వీరంతా కూడా లీకైన పేపర్ సాయంతోనే సీట్లు సాధించినట్లు తెలుస్తోంది. వికాస్‌కు పదో తరగతిలో 63శాతం, 12వ తరగతిలో 55శాతం మార్కులు వచ్చాయి. ఇక 2024లో నీట్ పరీక్ష రాస్తే కేవలం 720కి గాను 240తో సరిపెట్టుకొన్నాడు. సికార్‌లోని ఓ కోచింగ్ సెంటర్‌లో 46 పరీక్షలు రాస్తే సగటున 384 మార్కులు వచ్చాయి. కానీ, 2025లో మాత్రం 85.11 పర్సెంటైల్‌తో గవర్నమెంట్ కాలేజీలో సీటు సాధించడం విశేషం. ఇక ఆయన సోదరి ప్రగతి 10వ తరగతిలో 69శాతం , 12వ తరగతిలో 91శాతం మార్కులు వచ్చాయి. 2024 నీట్‌లో 720కి 355 మార్కులే వచ్చాయి. కానీ, సికార్‌లోని కోచింగ్ సెంటర్‌లో 50 నమూనా పరీక్షలు రాస్తే మార్కులు ఏనాడు 320- 342 దాటలేదు. కానీ, 2025లో హఠాత్తుగా 92.53 పర్సంటైల్‌తో ప్రభుత్వ మెడికల్ కాలేజీలో సీటు వచ్చింది. ఇక మరో కజిన్ సోనియాకు 10వ తరగతిలో 63?, 12వ తరగతిలో 89? మార్కులు వచ్చాయి. 2024 నీట్‌లో 320 మార్కులతో సరిపెట్టుకొంది. సికార్‌లోని కోచింగ్ సెంటర్‌లో 49 మాక్‌టెస్ట్‌లు రాస్తే 341-361 మధ్యే మార్కులు వచ్చాయి. అదే నీట్ పరీక్ష రాస్తే మాత్రం అలవోకగా 94.07 పర్సంటైల్‌తో ప్రభుత్వ కాలేజీలో సీటు పొందింది. ఇక పలాక్‌కు 10వ తరగతిలో 93శాతం, 12వ తరగతిలో 89 శాతంమార్కులు వచ్చాయి. 2024 నీట్‌లో 512 మార్కులు మాత్రమే సాధించింది. సికార్‌లోని కోచింగ్ సెంటర్లలో నిర్వహించిన 50 నమూనా పరీక్షల్లో ఆమెకు ఏనాడు 515-550 మార్కులు దాటలేదు. కానీ, 2025 నీట్‌లో 98.61 పర్సంటైల్‌తో జైపుర్‌లోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలో సీటు సాధించింది. ఇప్పుడు అదే కుటుంబం లోని రిషి కోసం పేపర్ కొనుగోలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అతడు 10వ తరగతిలో 43శాతం, 12వ తరగతిలో గ్రేస్ మార్కులు 50శాతం సాధించాడు.

# వచ్చే ఏడాది నుంచి నీట్ ఆన్‌లైన్ పరీక్ష

- లీకేజీని అరికట్టేందుకు చర్యలు
- కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్



**న్యూఢిల్లీ, మే 15 :** నీట్ పేపర్ లీక్ వ్యవహారం సంచలనం సృష్టించింది. దాంతో మే 3న నిర్వహించిన పరీక్షను రద్దు చేసి, మళ్లీ జూన్ 21న ఈ పరీక్షను నిర్వహించనున్నట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ శుక్రవారం వెల్లడించింది. ఈ నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మీడియాతో మాట్లాడారు. వచ్చే ఏడాది నుంచి నీట్ పరీక్ష ఆన్‌లైన్‌లో నిర్వహిస్తామని వెల్లడించారు. జూన్ 21న నీట్ రీఎగ్జామ్ తేదీ ఖరారైంది. నీట్ ప్రశ్నపత్రం లీక్ ఆరోపణలపై విచారణకు ఆదేశించాం. ఇప్పటికే ఈ కేసును సీబీఐ విచారిస్తోంది. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం. విద్యార్థులకు ఎలాంటి నష్టం కలగకుండా చర్యలు తీసుకుంటున్నాం. వారు నష్టపోకూడదనే పరీక్ష రద్దు చేసి మళ్లీ నిర్వహిస్తున్నాం అని వివరించారు. విద్యార్థుల భవిష్యత్తు బాగుండేలా చూడటమే మా మొదటి లక్ష్యం. పరీక్ష పారదర్శకంగా నిర్వహించడమే మా ప్రధాన కర్తవ్యం. ఏటా కోటి మందికి ఎన్టీఏ పరీక్షలు నిర్వహిస్తోంది. పేపర్ ఎలా లీక్ అయింది.. ఎవరి నుంచి ఎక్కడికి వెళ్లిందన్న పూర్తి వివరాలు పూర్తి బహిర్గతమవుతాయి. ఈసారి ఎలాంటి పరిస్థితుల్లోనూ మాల్ ప్రాక్టీస్ జరగకుండా చూసుకుంటాం. రీటెస్ట్ కోసం విద్యార్థులు నచ్చిన నగరాన్ని ఎంచుకోవడానికి వారం రోజులు గడువు ఇస్తున్నాం. జూన్ 14న అడ్మిట్ కార్డులు విడుదల చేస్తాం. నీట్ కోసం మళ్లీ ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు. సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోన్న వార్తలు చూసి విద్యార్థులు ఆందోళన చెందొద్దని ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు.

# ఆదివారం నుంచి అధిక జేష్టమాసం

**పెళ్లిళ్లు తదితరాలకు నెలపాటు విరామం**

**శుభముహూర్తాలకు బ్రేక వేళ తగ్గిన బంగారం ధరలు**



**విజయవాడ, మే 15 :** అధిక జేష్టమాసంతో శుభముహూర్తాలు అయిపోయాయి. మరో నెలరోజుల తరవాతనే పెళ్లి తదితర ముహూర్తాలకు ఛాన్స్ ఉంది. గురువారం నుంచి అన్నిరకాల శుభ ముహూర్తాలు ముగిసాయని పండితులు చెబుతున్నారు. ఫిబ్రవరి నుంచి మే 13 వరకూ తెలుగు లోగిళ్ళను వివిధ రకాల శుభకార్యాలతో కళకళలాడాయి. ఇప్పుడు ముహూర్తాలు నెల రోజల పైబడి లేవని సెలవిచ్చారు. ఆదివారం నుంచి అధిక జ్యేష్ఠ మాసం రానుండడంతో జూన్ 20 వరకూ మంచి రోజులు లేవని పురోహితులు చెపుతున్నారు.జూన్‌లో చివరి 8 రోజులు మంచి ముహూర్తాలున్నాయని పండితులు వివరిస్తున్నారు. జూలైలో మరో నాలుగు రోజులు మాత్రమే ముహూర్తాలున్నాయిని ఆ తరువాత చతుర్మాసం తదితర కారణాలతో ఆగస్టులో 11 రోజులు, సెప్టెంబరులో 4, అక్టోబరులో మరో 4 రోజులు మాత్రం ముహూర్తాలున్నా చతుర్మాసం అడ్డొస్తోందని పురోహితులు అంటున్నారు. ఆ తరువాత నవంబరులో కార్తీక మాసం కారణంగా 11 రోజులు, డిసెంబరులో మరో 14 రోజుల్లో కూడా అనువైన ముహూర్తాలున్నాయంటున్నారు. దీంతో పెళ్లిళ్లపై ఆధారపడ్డ వారు ,ఇతర కార్యక్రమాలపై ఆధారపడ్డ వారికి ఖాళీగా ఉండాల్సిన ఆగత్యం ఏర్పడింది. కారణం ఏదైనా భారత్‌లో బంగారం ధరల ర్యాలీకి బ్రేక్ పడినట్టు కనిపిస్తోంది. అంతర్జాతీయ అనిశ్చితులు, కేంద్రం దిగుమతి సుంకాల పెంపు నేపథ్యంలో బంగారం, వెండి ధరల్లో భారీ కోత కనిపించింది. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, శుక్రవారం ఉదయం 10.00 గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,60,090కు పడిపోయింది. నిన్నటి ముగింపుతో పోలిస్తే ధరలో ఏకంగా రూ.2,240ల మేర కోత పడింది. 22 క్యారెట్ల పసిడి ధర కూడా రూ.1,46,750కు చేరుకుంది. నిన్నటితో పోలిస్తే ధర రూ.2,050ల మేర తగ్గింది. నగరంలో వెండి ధరలో కూడా రూ.10 వేల కోత పడింది. ప్రస్తుతం కిలో వెండి రూ.3.05 లక్షల వద్ద ట్రేడవుతోంది ఇతర ప్రధాన నగరాల విషయానికి వస్తే చెన్నైలో ప్రస్తుతం 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,63,390గా ఉంది. ఢిల్లీలో రూ.1,60,240గా, ముంబైలో రూ.1,60,090 వద్ద కొనసాగుతోంది. చెన్నైలో 22 క్యారెట్ల ఆర్నమెంటల్ పసిడి ధర రూ.1,49,500గా, ఢిల్లీలో రూ.1,46,900గా, ముంబైలో రూ.1,46,750గా ఉంది. చెన్నై సహా పలు నగరాల్లో వెండి దర రూ.3.05 లక్షల వద్ద ట్రేడవుతోంది. నిన్నటితో పోలిస్తే దేశంలో కిలో వెండి ధర రూ.10 వేల మేర తగ్గింది.

# అలజడులు సృష్టిస్తున్న వైసిపి అల్లరిమూకలు

**నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి ఘాటు విమర్శలు**

**కర్నూలు, మే 15:** వైసీపీ నేతలపై నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి తీవ్ర స్థాయి-ంలో విరుచుకుపడ్డారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. కర్నూలులో వైసీపీ నేతల ఆందోళనలపై స్పందించారు. రౌడీ మూకల గురించి మాట్లాడాల్సిన అవసరం లేకపోయినా ప్రజాప్రతినిధిగా మాట్లాడుతున్నట్లు తెలిపారు. వైసీపీ నాయకులు చిల్లర ఇష్యూలను పట్టుకొని అల్లరి మూకలతో అలజడులు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. కర్నూలులో గురువారం జరిగిన వైసీపీ ఆందోళనలో సగం మందికి పైగా గంజాయి బ్యాచ్, క్రిమినల్ బ్యాక్ గ్రౌండ్ కలిగిన వారే పాల్గొన్నారని తెలిపారు. ఎస్వీ మోహన్ రెడ్డి స్క్రాప్ మనుషులతో మాట్లాడిస్తున్నారని మండిపడ్డారు. బాలు అనే వ్యక్తి అమ్మాయిలను బ్లాక్ మెయిల్ చేసి డబ్బులు దోచుకున్నాడని తెలిపారు. పోలీసులు చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటే వైసీపీ నాయకులు ఇలాంటి వారి కోసం ఆందోళనలు చేయడం సిగ్గుచేటని విమర్శించారు. ఆర్యవైశ్య సామాజిక వర్గానికి చెందిన మంత్రిపై ఏవేవో మాట్లాడుతున్నారని బైరెడ్డి శబరి ఆగ్రహం వ్యక్తం చేశారు. వారు వ్యాపారాలు చేసి కష్టపడి సంపాదించడం తప్పా అని ప్రశ్నించారు. తండ్రి పేరు చెప్పుకొని రాజకీయాల్లోకి వచ్చారని వైసీపీ నేత అంటున్నారని.. జగన్ తండ్రి పేరు చెప్పి రాజకీయాల్లోకి రాలేదా అని ప్రశ్నించారు. గంజాయి బ్యాచ్‌పై నిఘా పెడతామని స్పష్టం చేశారు. ముచ్చుమర్రిలో మైనర్ బాలికను అత్యాచారం చేసి చంపిన వాళ్లు వైసీపీ కార్యకర్తలే అంటూ ఆరోపించారు. బాలికను చంపిన వారిని వైసీపీ నేతలు పరామర్శించి.. తనపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినా తాను శవ రాజకీయం చేయలేదన్నారు. బాలిక శవం కోసం 5 రోజులు గాలించామని.. అప్పుడు వైసీపీ నేతలంతా ఎక్కడికి వెళ్లారని ప్రశ్నించారు. వైసీపీ నేతలు కాదు...రాక్షసులంటూ విరుచుకుపడ్డారు.

# ధరల పెంపుపై భగ్గుమన్న కాంగ్రెస్

**ఇక సైకిలే దిక్కన్న అఖిలేశ్ యాదవ్**

**న్యూఢిల్లీ, మే 15 :** దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలను లీటర్‌కు రూ.3 చొప్పున పెంచుతూ ఆయిల్ కంపెనీలు కీలక నిర్ణయం తీసుకోవడంపై ప్రతిపక్షాలు తీవ్రంగా తప్పుబట్టాయి. ఈ క్రమంలో ప్రధాని మోదీపై కాంగ్రెస్ ఘాటు విమర్శలు చేసింది. 'ద్రవ్యోల్బణ వ్యక్తి మోదీ. ఈరోజు మరోసారి ప్రజలపై కొరడా ఝుళిపించారు' అంటూ కాంగ్రెస్ తన అధికారిక ఎక్స్ ఖాతా వేదికగా విమర్శలు చేసింది. పెట్రోల్, డీజిల్, సీఎన్‌జీ ధరల పెంపును ఇటీవల ముగిసిన అసెంబ్లీ ఎన్నికలకు ముడిపెట్టింది. ఎన్నికలు ముగిసిన వెంటనే మోదీ తన వసూళ్లు ప్రారంభించారంటూ ఆరోపించింది. ఎన్నికల తర్వాత ఇంధన ధరలు పెరుగుతాయన్నది ఊహించినదే అంటూ తృణమూల్ కాంగ్రెస్ దుయ్యబట్టింది. ప్రజలపై భారాన్ని తగ్గించేందుకు పెట్రోల్, డీజిల్‌పై విలువ ఆధారిత పన్ను తగ్గిస్తుందా అంటూ పశ్చిమబెంగాల్‌లో కొత్తగా కొలువుదీరిన భాజపా నేతృత్వంలోని ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. కేంద్రం ఇంధన ధరలు పెంచడంపై సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ వ్యంగ్యంగా స్పందించారు. 'మీరు ముందుకుసాగాలంటే.. సైకిల్ ఒక్కటే ఆప్షన్' అని ఎక్స్‌లో పోస్టు పెట్టారు. దీనికి సైకిల్ తొక్కుతూ ఉన్న క్యారికేచర్‌ను పంచుకున్నారు. 'సైకిల్ పైనే ప్రయాణం కొనసాగిస్తామని ఇదివరకే చెప్పాం' అని దానికి ఆయన క్యాప్షన్ పెట్టారు. కాగా.. సమాజ్‌వాదీ పార్టీ గుర్తు సైకిల్ కావడం గమనార్హం.



# ప్రశాంతి నిలయం దర్శించుకున్న లోకేశ్

**పుట్టపర్తి, మే 15 :** శ్రీ సత్యసాయి జిల్లాలో మంత్రి నారా లోకేశ్ రెండో రోజు పర్యటన కొనసాగుతోంది. శుక్రవారం ఉదయం పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయాన్ని మంత్రి సందర్శించారు. ప్రశాంతి నిలయంలో లోకేశ్‌కు సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ నిర్వాహకులు స్వాగతం పలికారు. అనంతరం సాయి కుల్వంత్ మందిరంలోని శ్రీ భగవాన్ సత్యసాయి బాబా మహాసమాధిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టీడీపీ స్టేట్ మీడియా కోఆర్డినేట్ రాష్ట్ర కార్యదర్శి బి.వి రాముడు తదితరులు పాల్గొన్నారు. పుట్టపర్తిలో అడ్వాన్స్‌డ్ మీడియం కాంబాట్ ఎయిర్ క్రాఫ్ట్(ఏఎంసీఏ) తయారీ కేంద్రానికి శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి లోకేశ్ పాల్గొననున్నారు. ఏఎంసీఏ ఇంటిగ్రేషన్, ఫ్లైట్ టెస్టింగ్ సెంటర్, ఏరోనాటికల్ డెవలప్ మెంట్ ఏజెన్సీ, ఇతర రక్షణ రంగ ప్రాజెక్టులకు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, సీఎం చంద్రబాబు నాయుడుతో కలిసి శంకుస్థాపన చేయనున్నారు. రూ.15,803 కోట్లతో ఏఎంసీఏ ప్రాజెక్టుకు శంకుస్థాపన జరగనుంది. దీంతో 7,500 మందికి ఉద్యోగావకాశాలు లభించనున్నారు.



# పెట్రో ధరల పెంపు అనివార్యం

**కాంగ్రెస్, బిఆర్ఎస్‌లవి పనీపాటలేని విమర్శలు**

**మండిపడ్డ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి**

**హైదరాబాద్, మే 15 :** పెట్రోల్, డీజిల్ ధరల పెంపును అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలు రాజకీయంగా వాడుకొంటున్నాయని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి మండిపడ్డారు. ఈ రెండు పార్టీలకు పనీపాట లేదని.. అందువల్లే ఈ తరహా ఆరోపణలు చేస్తున్నాయంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దయచేసి ఆ యా పార్టీల నేతల మాటలు విని మోసపోవద్దంటూ ప్రజలకు స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో పెట్రోల్, డీజిల్ ధరలు పెంపుపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. దేశవ్యాప్తంగా పెట్రోలు ధరలు పెరిగాయన్నారు. ఈ పెంచిన ధరలు శుక్రవారం ఉదయం నుంచి అమల్లోకి వచ్చాయని చెప్పారు. అమెరికా, ఇరాన్ యుద్ధ ప్రభావంతోనే పెట్రోల్, డీజిల్ ధరలు పెంపు అనివార్య మైందన్నారు. అంతేకానీ ఇది ప్రజల మీద భారం వేసేందుకు కాదన్నారు. క్రూడాయిల్ దిగుమతికి భారీగా ఖర్చు అవుతుందని వివరించారు. అందుకోసమే కేంద్రం ఈ నిర్ణయం తీసుకుందని ఆయన వివరించారు. అంతర్జాతీయ స్థాయిలో అమెరికా, జర్మనీ, జపాన్ తదితర దేశాల్లో పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సోదాహరణగా వివరించారు. పెట్రోల్, డీజిల్ లీటర్ ధరలు రూ.3కు పైగా పెంచుతూ ఆయిల్ కంపెనీలు నిర్ణయం తీసుకున్నాయి. వీటి ధరలు పెంచడం వల్ల ప్రజలపై అదనపు భారం పడుతుందంటూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు విమర్శలు గుప్పిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పైవిధంగా స్పందించారు.

# రూపాయి మరింత పతనం..

## తొలిసారి రూ.96 దాటిన విలువ



ముంబయి: అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకపు విలువ భారీగా పతనం అయ్యింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా డాలర్ విలువ తొలిసారి రూ.96 మార్కును దాటింది. గురువారం ట్రేడింగ్ సెషన్‌లో 95.96 వద్ద కనిష్ఠాన్ని తాకిన రూపాయి విలువ.. శుక్రవారం మధ్యాహ్నం 96.07 కనిష్ఠాన్ని తాకింది. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరల పెరుగుదల నేపథ్యంలో మన రూపాయిపై ఒత్తిడి పెరుగుతోంది. రూపాయి విలువ పతనమైతే.. దిగుమతి చేసుకునే వంట నూనెలు, చమురు, సహజవాయువు, ఎలక్ట్రానిక్స్, బంగారం, లగ్జరీ కార్లు, గడియారాలు మరింత ఖరీదవుతాయి. నిత్యావసరాల ధరలు పెరుగుతాయి. ద్రవ్యోల్బణం పెరిగి, ప్రజల కొనుగోలు శక్తి క్షీణిస్తుంది. విదేశీ ఉన్నతవిద్య కోసం తమ పిల్లల్ని పంపిన తల్లిదండ్రులపై భారం పెరుగుతుంది. అదే సమయంలో మన దేశం నుంచి వస్తువులు, సేవలు ఎగుమతి చేసేవారికి మాత్రం లాభం కలుగుతుంది.






## నష్టాల్లో ముగిసిన సూచీలు

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. ఉదయం లాభాల్లో ప్రారంభమైన సూచీలు.. ఆఖర్లో అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు పెరగడం, డాలరుతో రూపాయి మారకం విలువ తొలిసారి 96 మార్కును దాటడం సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. దీనికితోడు మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపడంతో రెండ్రోజుల వరుస లాభాలకు బ్రేక్ పడింది. సెన్సెక్స్ ఉదయం 75,497.10 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 75,398.72) లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 75,870.36 వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. ఆఖర్లో అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొంది. చివరికి 160.73 పాయింట్ల నష్టంతో 75,237.99 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 46.10 పాయింట్ల నష్టంతో 23,643.50 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ ఇంట్రాడేలో 96.15 వద్ద కనిష్ఠాన్ని తాకి 95.94కి చేరింది. సెన్సెక్స్ 30 సూచీలో టాటా స్టీల్, ఎటర్నల్, రిలయన్స్, అల్ట్రాటెక్ సిమెంట్, ఎస్‌బీఐ షేర్లు నష్టాల్లో ముగిశాయి. ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, అదానీ పోర్ట్స్, మారుతీ సుజుకీ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 108 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4,560 వద్ద ట్రేడవుతోంది.



## టికెట్ ధరలను భారీగా పెంచిన సన్‌రైజర్స్

సన్‌రైజర్స్ హైదరాబాద్ యాజమాన్యం ఐపీఎల్ టికెట్ల ధరలు భారీగా పెంచింది. ఈ నెల 22న ఉప్పల్ వేదికగా ఎస్‌ఆర్‌హెచ్, ఆర్సీబీ మ్యాచ్ జరగనుంది. సాయంత్రం 5 గంటలకు డిస్ట్రిక్ట్ యాప్‌లో టికెట్ల బుకింగ్ మొదలైంది. ఈక్రమంలో రూ.950 టికెట్ ధరను రూ.2 వేలకు పెంచారు. రూ.1500 టికెట్‌ను రూ.3 వేలకు, రూ.1910 టికెట్‌ను రూ.3,500కు, రూ.2,500 టికెట్ ధరను రూ.4,500కు, రూ.4,500 టికెట్‌ను రూ.6 వేలకు, రూ.7 వేల టికెట్‌ను రూ.10 వేలకు, రూ.23 వేల బాక్స్ టికెట్ ధరను రూ.30 వేలకు పెంచారు. రూ. 30వేల కార్పొరేట్ బాక్స్ టికెట్ ధరను రూ.45 వేలకు పెంచారు.

## పాకిస్థాన్ క్రికెట్ జట్టుకు ఐసీసీ డబుల్ షాక్

ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ నాలుగో సీజన్‌లో పాకిస్థాన్ జట్టు ఆడింది కేవలం మూడే టెస్టులు. అందులో రెండింట్లో ఓడిపోగా.. ఒక్క విజయం మాత్రమే సాధించింది. డబ్ల్యూటీసీ ఫైనల్ రేసులో ఎక్కడో ఎనిమిదో స్థానంలో ఉంది. తాజాగా ఐసీసీ నిర్ణయంతో పాయింట్ల కోతతో పాటు ఆటగాళ్ల మ్యాచ్ ఫీజులో భారీ జరిమానా పడింది. దీంతో పాక్‌కు ఐసీసీ డబుల్ షాక్ ఇచ్చింది. ఢాకా వేదికగా బంగ్లాదేశ్‌తో జరిగిన తొలి టెస్టులో పాకిస్థాన్ 104 పరుగుల తేడాతో ఘోర ఓటమిని చవిచూసింది. 267 పరుగుల లక్ష్యాన్ని ఛేదించలేక కుదేలైంది. ఈ మ్యాచ్‌లో పాక్ స్లో ఓవర్ రేట్ కారణంగా ఐసీసీ రిఫరీ ఆగ్రహానికి గురైంది. ఏకంగా 8 ఓవర్ల పాటు ఆలస్యం కావడంతో డబ్ల్యూటీసీలో ఎనిమిది పాయింట్లను కోల్పోయింది. ప్రస్తుతం ఆ జట్టు ఖాతాలో కేవలం నాలుగు పాయింట్లు మాత్రమే ఉన్నాయి. ఇప్పటికే ఓటమి బాధలో ఉన్న పాక్‌కు ఇది తొలి షాక్. ఆ జట్టు కెప్టెన్ షాన్ మసూద్‌తో పాటు ఆటగాళ్లందరికీ ఒక్కొక్కరిపై 40 శాతం మ్యాచ్ ఫీజులో జరిమానా విధిస్తూ ఐసీసీ రెండో షాక్ ఇచ్చింది. మ్యాచ్ రిఫరీ జెఫ్ క్రోవ్ నిర్ణయం మేరకు విధించినట్లు ఐసీసీ ప్రకటన విడుదల చేసింది. ఐసీసీ నిబంధనల ప్రకారం.. ఒక్కో స్లో ఓవర్‌కు మ్యాచ్ ఫీజులో 5 శాతం, ఒక పాయింట్‌ను కోల్పోవాల్సి ఉంటుంది. ఇప్పుడు పాకిస్థాన్ ఏకంగా 8 ఓవర్లు ఆలస్యం కావడంతో భారీ జరిమానా తప్పలేదు. ప్రస్తుతం ఐసీసీ డబ్ల్యూటీసీ టేబుల్‌లో ఆస్ట్రేలియా (87.50 శాతం), న్యూజిలాండ్ (77.78 శాతం) తొలి రెండు స్థానాల్లో కొనసాగుతున్నాయి. దక్షిణాఫ్రికా (75), శ్రీలంక (66.67), భారత్ (48.15) తర్వాత స్థానాల్లో ఉన్నాయి. వచ్చే ఏడాది మార్చి నాటికి తొలి రెండు స్థానాల్లో నిలిచే టీమ్‌లు డబ్ల్యూటీసీ ఫైనల్‌లో తలపడ్డాయి. ఎవరు విజేతగా నిలిస్తే వారికే టెస్టు గద దక్కుతుంది.



# చెన్నైకి షాక్..

## లఖ్‌నవూ ఘన విజయం

**లఖ్‌నవూ:** ఐపీఎల్ 2026లో భాగంగా చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. వరుసగా మూడు విజయాలతో జోరు మీదున్న చెన్నైకి బ్రేక్ పడింది. అలాగే ఈ ఓటమితో ఆ జట్టు ప్లేఆఫ్స్ అవకాశాలు సంక్లిష్టంగా మారాయి. పాయింట్ల పట్టికలో చెన్నై అయిదు నుంచి ఆరో స్థానానికి పడిపోయింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన చెన్నై నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 187 పరుగులు చేసింది. అనంతరం ఛేదనలో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ సత్తా చాటింది. 16.4 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 188 పరుగులు చేసింది. లఖ్‌నవూ బ్యాటర్లలో మిచెల్ మార్ష్ (90; 38 బంతుల్లో 9 ఫోర్లు, 7 సిక్స్‌లు) సునామీ ఇన్నింగ్స్ ఆడాడు. జోష్ ఇంగ్లిస్ (36) రాణించాడు. అబ్దుల్ సమద్ (7) బ్యాటింగ్‌లో విఫలమయ్యాడు. నికోలసన్ పూరన్ (32), ముకుల్ చౌదరి (13) నాటౌట్‌గా నిలిచారు. చెన్నై బౌలర్లలో ముకేశ్ చౌదరి, స్పెన్సర్ జాన్సన్ తలో వికెట్ తీసుకున్నారు. అంతకు ముందు చెన్నై బ్యాటర్లలో కార్తిక్ శర్మ (71; 42 బంతుల్లో; 6 ఫోర్లు 5 సిక్స్‌లు) బ్యాట్‌తో అద్భుత ప్రదర్శన చేశాడు. శివమ్ దూబె 32లి, డెవాల్డ్ బ్రెవిస్ 25, సంజు శాంసన్ 20 పరుగులు చేశారు. ఉర్విల్ పటేల్ (6), రుతురాజ్ గైక్వాడ్ (13) బ్యాటింగ్‌లో విఫలమయ్యారు. ప్రశాంత్ వీర్



(13) నాటౌట్‌గా నిలిచాడు. లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ బౌలర్లలో ఆకాశ్ మహరాజ్ సింగ్ 3, మహ్మద్ షమీ, షహబాజ్ అహ్మద్ చెరో వికెట్ తీసుకున్నారు.




## అందుబాటులోకి ఐటీఆర్-1, ఐటీఆర్-4 ఆన్‌లైన్ ఫైలింగ్

న్యూఢిల్లీ : ఆదాయపు పన్ను రిటర్నులకు సంబంధించి కీలక ప్రకటన వచ్చింది. చిన్న, మధ్యస్థాయి పన్ను చెల్లింపుదారులు ఫైల్ చేసే ఐటీఆర్-1, ఐటీఆర్-4లను ఎనేబుల్ చేసింది. ఇ-ఫైలింగ్ పోర్టల్‌లో 2026-27 మదింపు సంవత్సరానికి గానూ ఎక్సెల్ యుటిలిటీ, ఆన్‌ఫైలింగ్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు 'ఎక్స్'లో పోస్ట్ పెట్టింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఆర్జించిన ఆదాయానికి సంబంధించి ఈ ఫారాల ద్వారా రిటర్నులు ఫైల్ చేయొచ్చని తెలిపింది. వ్యక్తిగత ఆదాయపు పన్ను రిటర్నులు దాఖలు చేయడానికి జులై 31 వరకు గడువు ఉంటుంది. ఆడిట్ అవసరం లేని ఐటీఆర్-4 దాఖలు చేసే ట్యాక్స్ పేయర్లకు ఆగస్టు 31లోపు ఐటీఆర్ ఫైల్ చేయాల్సి ఉంటుంది. రిటర్నులు దాఖలు చేయడానికి ఆన్‌లైన్‌లో సదుపాయం అందుబాటులోకి వచ్చినప్పటికీ.. వేతనాలు పొందే వారికి జూన్‌లో ఫారం-16 అందే అవకాశం ఉంటుంది. వీరు అప్పుడే రిటర్నులు దాఖలు చేయడానికి వీలవుతుంది. ఐటీఆర్-1: దేశంలో నివసించే వ్యక్తి ఆదాయం రూ.50లక్షలున్న వారు, వేతనం, ఒక ఇంటి ద్వారా ఆదాయం, సెక్షన్ 11ఏ ప్రకారం రూ.1.25 లక్షలలోపు దీర్ఘకాలిక మూలధన లాభాలు, రూ.5,000 వరకూ వ్యవసాయ ఆదాయం ఉన్న వారికి ఈ ఫారం వర్తిస్తుంది. ఐటీఆర్-4: మొత్తం ఆదాయం రూ.50 లక్షల వరకూ ఉన్నవారు (వ్యక్తులు, హెచ్‌యూఎఫ్, సంస్థలు) వృత్తి, ఆదాయం ద్వారా ఆదాయాన్ని ఆర్జిస్తున్న వారు, దీర్ఘకాలిక మూలధన లాభాలు రూ.1.25 లక్షల్లోపు ఉన్నప్పుడు ఈ ఫారాన్ని వినియోగించాల్సి ఉంటుంది.




## ధరలు పెంచినా నష్టాల్లో ఆయిల్ షేర్లు..

**న్యూఢిల్లీ :** అందరూ ఊహించినట్లే దేశీయంగా చమురు ధరలు పెరిగాయి. పెట్రోల్, డీజిల్ ధరలను లీటరుకు రూ.3 చొప్పున చమురు కంపెనీలు సవరించాయి. ఇన్నాళ్లు భారీ నష్టాలు చవిచూస్తున్న ప్రభుత్వరంగ చమురు కంపెనీలకు ఇది ఊరట కల్పించే అంశం. అయితే, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచినప్పటికీ ఆయా కంపెనీల షేర్లు నష్టాలు చవిచూడడం గమనార్హం. హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ ఇంట్రాడేలో 3 శాతం మేర పతనమై రూ.376కి చేరింది. భారత్ పెట్రోలియం కార్పొరేషన్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సైతం దాదాపు 2 శాతం నష్టాల్లో ట్రేడవుతున్నాయి. అటు సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీలైన మహానగర్ గ్యాస్, ఇంద్రప్రస్థ గ్యాస్, గుజరాత్ గ్యాస్ కంపెనీలు కూడా నష్టాల్లో ట్రేడవుతుండడం గమనార్హం. క్రూడాయిల్‌ను ముడిపదార్థంగా వినియోగించే పెయింట్ స్టాక్స్ కూడా క్షీణించాయి. ఇండిగో పెయింట్స్, ఏషియన్ పెయింట్స్, బెర్జర్ పెయింట్స్ స్వల్ప నష్టాలు చవిచూశాయి. పెట్రోల్, డీజిల్ రిటైల్ ధరలు స్వల్ప మొత్తంలో పెరగడం వల్ల ప్రభుత్వరంగ చమురు సంస్థలకు కొంతమేర ఊరట కల్పించే అంశం అయినప్పటికీ.. నష్టాలను పూడ్చే స్థాయిలో లేకపోవడంతో ఆయిల్ కంపెనీ షేర్లు క్షీణించినట్లు అనలిస్టులు అంచనా వేస్తున్నారు. ఒకప్పుడు 60 డాలర్లుగా బ్యారెల్ క్రూడాయిల్ ధర పశ్చిమాసియా ఉద్రిక్తలతో గరిష్ఠంగా 130 డాలర్ల వరకు చేరిందని, ప్రస్తుతం 107 డాలర్ల వద్ద ట్రేడవుతోందని తెలిపారు. దీంతో రోజుకు రూ.1000 కోట్లు చొప్పున చమురు కంపెనీలు నష్టాలు చవిచూస్తున్నట్లు కేంద్రమంత్రి హర్దీప్‌సింగ్ పురి వెల్లడించిన విషయాన్ని గుర్తుచేస్తున్నారు. చమురు ధరలు ఇంకా పెరిగే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ఇలానే కొనసాగి హర్మూజ్ తెరుచుకోకపోతే రాబోయే వారాల్లో పెట్రోల్, డీజిల్ ధరలు మరింత పెరిగే అవకాశం ఉంటుందని పేర్కొంటున్నారు. పెట్రోల్, డీజిల్‌పై లీటరుకు రూ.15 వరకు పెంచొచ్చని మార్కెట్ అంచనా వేసిందని, పెరిగిన మొత్తం తక్కువేనని అభిప్రాయపడుతున్నారు. కాబట్టి మున్ముందు పెంపు నిర్ణయాలు వెలువడొచ్చని అంచనా వేస్తున్నారు.

## ప్రతిసారీ నిరూపించుకోవాల్సిన

# పరిస్థితులు నాకొద్దు : విరాట్

- ఆట కోసం ఏం చేయాలో నాకు తెలుసు
- భారత్ తరఫున వరల్డ్ కప్‌లో ఆడటం ఎప్పుడూ అద్భుతమే

భారత స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లీ అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. ఇప్పటికే అంతర్జాతీయ టీ20లు, టెస్టులకు వీడ్కోలు పలికిన కోహ్లీ వన్డేల్లోనే కొనసాగుతున్నాడు. వచ్చే వన్డే ప్రపంచకప్‌లో అతడికి చోటు దక్కుతుందా? లేదా? అనే దానిపై చర్చ సాగుతూనే ఉంటుంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో టీమ్‌ఇండియా సెలక్షన్ కమిటీని ఉద్దేశించి పరోక్షంగా విరాట్ కీలక వ్యాఖ్యలు చేశాడు. ప్రతిసారి తన నిబద్ధతను నిరూపించుకోవాలనే పరిస్థితులను కోరుకోవడం లేదని స్పష్టంచేశాడు.

నేనెప్పుడూ సిద్ధమే..

- నా దృక్పథం చాలా స్పష్టం. జట్టుకు విలువ తీసుకొస్తానని అనుకుంటే భాగమవుతా. టీమ్‌కు ఉపయోగమని భావిస్తే నన్ను గుర్తించినట్లు అవుతుంది. అలా కాకుండా ప్రతిసారీ నిరూపించుకోవాలని అంటే మాత్రం.. అక్కడ ఉండలేను.
- నా సన్నద్ధత, నిబద్ధతపై అత్యంత నిజాయతీగా వ్యవహరిస్తా. గేమ్‌లో ఎలా ముందుకువెళ్లాలనే విషయంలో నిజాయతీతో ఉంటా. అందుకోసం కష్టపడతా. నాకు అంతటి శక్తినిచ్చిన దేవుడికి ఎప్పుడూ రుణపడి ఉంటా.
- కష్టపడే విషయంలో నేనెవరికీ తక్కువ కాదు. వన్డేల్లో 40 ఓవర్ల పాటు ఈ బౌండరీ నుంచి ఆ బౌండరీ లైన్ వరకూ పరుగు పెట్టమనండి. ఎలాంటి ఫిర్యాదు లేకుండా ఆ పని చేస్తా. అందుకుతగ్గట్టుగానే నా సన్నద్ధత ఉంటుంది.
- 50 ఓవర్లలో.. ప్రతి బంతి కూడా నాకు చివరిదే అన్నట్లుగా భావిస్తా. కెరీర్‌లో నేను ఇదే నా చివరి బంతి అనుకుంటా. నా బ్యాటింగ్ కూడా అదేవిధంగా ఉంటుంది. జట్టు కోసం నావల్ల ఏదైతే అది చేయడానికి సిద్ధంగా ఉంటా.
- ఇవన్నీ చేసినా.. నా స్థానం కోసం నిరూపించుకోవాలంటే మాత్రం అక్కడ ఉండలేను. ఆట కోసం ఏం చేయాలో నాకు తెలుసు. ఏదైనా సిరీస్‌కు రెండు లేదా మూడు వారాల ముందు సన్నద్ధత అయ్యే వ్యక్తిని కాను. ఏడాదంతా రెడీగా ఉంటా. నువ్వు రాబోయే సిరీస్‌లో ఆడాలని చెబితే అందుకు సిద్ధమని చెబుతా.
- నా రోజువారీ దినచర్య అలానే ఉంటుంది. వర్కౌట్లు చేస్తా. మంచి ఆహారం తీసుకుంటా. ఇదేదో కేవలం క్రికెట్ కోసం మాత్రమే కాదు. నా లైఫ్ స్టైల్ అలాంటిది.
- ఇప్పుడు మనం 2026 ఏడాది మధ్యలో ఉన్నాం. అయినా చాలామంది 2027 వన్డే ప్రపంచ కప్‌లో ఆడతావా? లేదా? అడుగుతుంటారు. ఆ ప్రశ్నకు నాకు సమాధానం తెలుసు. భారత్ తరఫున వరల్డ్ కప్‌లో ఆడటం ఎప్పుడూ అద్భుతమే. అది కేవలం నేను ఒక్కడినే తీసుకొనే నిర్ణయం కాదు



### అప్పుడు టెస్టులకు స్వర్ణయుగం

"టెస్టు జట్టుకు నాయకత్వం వహించడం ఎప్పుడూ గర్వకారణమే. ఎన్నో విజయాలు సాధించాం. ఆ సమయం టెస్టులకు స్వర్ణయుగం అనిపించింది. యువ క్రికెటర్లూ తమ అవకాశాల కోసం ఎదురుచూస్తూ ఉండేవారు. రిజర్వ్ బెంచ్ కూడా బలంగా ఉండేది. అప్పుడు జట్టులో ఉన్న ఆటగాళ్లకు, నాకు వయసులో పెద్దగా వ్యత్యాసం లేకపోవడమూ కలిసొచ్చింది. ప్రతిఒక్కరితో బాధ్యతలను పంచుకొనేవాడిని. అక్కడ సీనియర్లు, జూనియర్లు అనే గొడవే లేదు. మేమంతా స్నేహితుల్లా ఉండేవాళ్లం. నాయకత్వం చేపట్టినప్పుడు ఒకటే అనుకున్నా. మరో ఏడెనిమిదేళ్ల తర్వాత ఈ జట్టు గురించి ప్రతిఒక్కరూ మాట్లాడుకోవాలని భావించాం. అందుకుతగినట్టుగానే విదేశాల్లో మేం అత్యుత్తమ విజయాలు సాధించాం" అని కోహ్లీ వెల్లడించాడు.

# ఫేస్‌ప్యాక్ వేసుకునేప్పుడు.. ఈ తప్పులు చేయకూడదు..!





అందంగా, ఆకర్షణీయంగా కనిపించాలని.. ప్రతి ఒక్క అమ్మాయి, మహిళ కోరుకుంటుంది. వారి సౌందర్యాన్ని రెట్టింపు చేసుకోవడానికి, వారి అందాన్ని కాపాడుకోవడానికి ఏవేవో స్కిన్‌కేర్ రొటీన్స్ ఫాలో అవుతుంటారు. ఎక్కువమంది ఫాలో అయ్యే.. బ్యూటీకేర్ రొటీన్ ఫేస్ మాస్క్‌లు. వారి అందానికి మెరుగులు పెట్టడానికి.. ఇంట్లో దొరికే సహజమైన వస్తువులతోనే.. ఫేస్‌మాస్క్‌లు వేసేస్తూ ఉంటారు. అయితే, ఫేస్‌మాస్క్ అప్లై చేసేప్పుడు చేసే కొన్ని పొరపాట్ల కారణంగా దుష్ప్రభావాలు ఎదురయ్యే అవకాశం ఉందని నిపుణులు అంటున్నారు. ఫేస్‌మాస్క్ అప్లై చేసేప్పుడు చేయకూడని 5 పొరపాట్లు ఏమిటో ఈ స్టోరీలో చూద్దాం.

ప్యాచ్ టెస్ట్ చేయట్లేదా.. కొత్తరకం ఫేస్‌మాస్క్ అప్లై చేసేముందు.. ప్యాచ్ టెస్ట్ కచ్చితంగా చేసుకోవాలని నిపుణులు అంటున్నారు. ఒకరికి బాగా పనిచేసే.. ఫేస్ ప్యాక్ మరొకరికి పడకపోవచ్చు. దానిలో పదార్థాలు అలెర్జీ, చికాకు కలిగించవచ్చు. మీరు ఫేస్‌ప్యాక్ అప్లై చేసేముందు.. ఏదైనా చిన్న ప్రాంతంలో ప్యాచ్ టెస్ట్ చేయడం మర్చిపోకండి. రాగులతో ఇలా మాస్క్ వేసుకుంటే.. మొటిమలు మాయం అవుతాయ్, పిగ్మెంటేషన్ కూడా దూరం అవుతుంది..!




తరచూ ఫేస్ ప్యాక్ వేస్తున్నారా.. కొంతమంది అందంగా కనిపించాలని తరచూ ఫేస్ ప్యాక్స్ వేస్తుంటారు. అయితే వీటిని తరచుగా అప్లై చేస్తే.. ఓవర్ ఎక్స్‌ఫోలియేషన్ అవుతుంది. దీనికారణంగా చర్మం పొడిబారుతుంది, కొన్నిసార్లు చికాకు కూడా కలిగిస్తుంది. . ఓవర్-ఎక్స్‌ఫోలియేషన్ చర్మాన్ని సున్నితంగా మారుస్తుంది. అతి ఏదైనా హాని చేస్తుందని గుర్తుంచుకోండి.

ముఖాన్ని శుభ్రం చేసుకోవట్లేదా.. ముఖాన్ని శుభ్రం చేసుకోవట్లేదా.. కొంతమంది ముఖం శుభ్రం చేసుకోకముందే.. ఫేస్‌ప్యాక్ అప్లై చేస్తుంటారు. మీ ముఖాన్ని సరిగ్గా శుభ్రం చేసుకోకుండా.. ప్యాక్ అప్లై చేస్తే.. ఉత్పత్తి సమర్థవంతంగా చర్మంలోని వెళ్లదు. దీనివల్ల ప్యాక్ ఎఫెక్టివ్‌గా పనిచేయదు. ఏదైనా ఫేస్ ప్యాక్ వేసుకునే ముందు మీ ముఖాన్ని శుభ్రం చేసుకోవడం మర్చిపోవద్దు. ప్యాక్‌వేసి ఎక్కువసేపు ఉంచుకోవద్దు.. కొందరు ఫేస్‌ప్యాక్ అప్లై చేసి.. ఎక్కువసేపు ఆరనిస్తారు. ఇలా చేస్తే.. చర్మానికి చికాకు కలిగిస్తుంది. అంతేకాదు, చర్మంలోని సహజ నూనెలు కోల్పోతాయి. మీరు ప్యాక్ ఆరిన వెంటనే శుభ్రం చేయడం చాలా ముఖ్యం.

# ఈ ఆసనాలు చేస్తే సైనస్ తగ్గుతుందట..







సైనస్ ఉంటే ముక్కు మూసుకుపోయి శ్వాస తీసుకోవడంలో ఇబ్బందిగా ఉంటుంది. ఇది చలికాలంలో మరింత ఎక్కువ అవుతుంది. అలాంటి సమస్యకి చెక్ పెట్టాలంటే ఈ ఆసనాలు హెల్ప్ చేస్తాయి. అవేంటో తెలుసుకోండి. మన శ్వాసకోశ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటేనే మనం హెల్దీగా ఉండగలం. కానీ, కొన్ని సమస్యల కారణంగా శ్వాస సమస్యలు వస్తాయి. అందులో సైనస్ కూడా ఒకటి. దీని వల్ల ముక్కు రంధ్రాలు మూసుకుపోతాయి. దీనిని అస్సలు తేలిగ్గా తీసుకోలేం. కానీ కొన్ని యోగాసనాలతో సైనస్ సమస్యని పరిష్కరించుకోవచ్చు. సేతు బంధాసనం.. ఇది బ్రిడ్జ్ పోజ్ అని చెప్పొచ్చు. దీనిని చేయడం వల్ల బ్యాక్, కాళ్ళను బలంగా చేస్తుంది. మీ గొంతు, ఛాతీని క్లియర్ చేస్తుంది. మూసుకుపోయిన ముక్కు నుండి ఉపశమనం పొందేలా చేస్తుంది. ప్రాణాయామం.. ఇందులో ముఖ్యంగా అనులోమ, విలోమ, కపాలభాతి వంటి ప్రాణాయామ పద్ధతులు నాసికా రంధ్రాలను క్లియర్ చేస్తాయి. వీటిని చేయడం వల్ల శ్వాస ప్రక్రియలు నియంత్రిస్తాయి. ఊపిరితిత్తుల సామర్థ్యాన్ని పెంచుతుంది. దీంతో ఆక్సిజన్ సరఫరా పెరిగి సమస్యకి పరిష్కారం లభిస్తుంది. భుజంగాసన.. ఇది మీ ఛాతీని ఎక్స్‌పాండ్ చేసి సైనస్ సమస్యల నుండి రిలాక్స్ చేసే నాగు పాము భంగిమ. దీనిని చేయడం వల్ల ఛాతీ ఎక్స్‌పాండ్ అయి వెన్నెముకని బలంగా చేసి వెన్నునొప్పిని కూడా తగ్గిస్తుంది. ఛాతీలో ఇబ్బంది తగ్గడంతో సైనస్ కూడాతగ్గుతుంది. పర్వతాసన.. ముక్కు రంధ్రాలను క్లియర్ చేసి మంట నుండి రిలాక్స్ చేసేలా చేస్తుంది. దీనిని చేయడం వల్ల భుజాలు, చేతులని చాచి చేయొచ్చు. దీని వల్ల సైనస్ వంటి సమస్యలు దూరమవుతాయి.

# తిన్న తర్వాత సోడా కూల్‌డ్రింక్స్ తాగుతున్నారా..





చాలా మందికి బిర్యానీ తింటూ కూల్ డ్రింక్స్ తాగడం అలవాటు. దీని వల్ల కడుపులో హాయిగా ఉందనుకుంటారు. కానీ, కొన్ని సమస్యలున్నాయి. అవేంటో తెలుసుకోండి. తిన్న తర్వాత సోడా, కూల్‌డ్రింక్స్ తాగుతున్నారా.. జాగ్రత్త.. ఏదైనా హెవీగా భోజనం చేసినప్పుడు చాలా మంది సోడా, కూల్ డ్రింక్స్ తాగడం చేస్తుంటారు. లేదా నిమ్మకాయ సోడాలో ఉప్పు కలిపి తాగుతారు. దీని వల్ల కడుపులో కాస్తా రిలాక్స్‌గా ఉన్నట్లుగా త్రేన్పులు వస్తాయి. అప్పటికప్పుడు రిలాక్స్‌గా ఫీల్ అవుతారు. కానీ, తర్వాత కొన్ని సమస్యలొస్తాయని చెబుతున్నారు నిపుణులు. అవేంటో తెలుసుకోండి.




సోడా తాగితే.. భోజనం చేశాక సోడా తాగితే ఎక్కువగా తినాలనే కోరికలు తగ్గుతాయి. వెంటనే కడుపులో పేరుకుపోయిన గ్యాస్ పోయినట్టుగా అనిపిస్తుంది. కానీ, ఇది తాత్కాలికంగా మాత్రమే. తిన్నాక సోడా తాగితే గ్యాస్ పెరుగుతుంది. దీంతో పాటు చాలా సమస్యలొస్తాయి.


గ్యాస్ పెరిగితే.. కడుపులో గ్యాస్ పెరిగితే పొట్ట నొప్పి వస్తుంది. ఊపిరి పీల్చుకోవడం కూడా కష్టంగా అనిపిస్తుంది. దీంతో కూర్చోలేరు, నించోలేరు ఇబ్బందిగా ఉంటుంది. అదే విధంగా కొంతమందికి గుండెల్లో మంట, మలబద్ధకం, త్రేన్పులు, వెన్నునొప్పి వీటితో పాటు ఛాతీ నొప్పి కూడా వచ్చే అవకాశం ఉంది.

జ్యూసెస్.. ఇక కొంతమంది, అదే విధంగా తిన్న తర్వాత జ్యూస్ కూడా తాగుతారు. ఇలా తాగడం కూడా అస్సలు మంచిది కాదు. దీని వల్ల జీర్ణ సమస్యలు వచ్చే అవకాశం ఉంది. దీంతో బరువు కూడా పెరుగుతారు. అందుకే, వీటిని తాగకపోవడమే మంచిది. ఏం తాగాలి.. తిన్న తర్వాత వేడినీరు తాగడం మంచిది. భోజనం మధ్యలో నీరు తాగొద్దు. తిన్న తర్వాత కాసేపటికి గోరువెచ్చని నీరు, జీలకర్ర నీరు తాగడం మంచిది. మీకు ఏం తాగడం ఇష్టం లేకపోతే కాసేపటి తర్వాత గోరువెచ్చని నీరు తాగండి. దీంతో తిన్న ఆహారం చక్కగా జీర్ణమవుతుంది. వీలైతే హెర్బల్ టీలు కూడా తాగొచ్చు.

# గుండెకు చాలా మంచిది



ఫైబర్ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. బరువును కంట్రోల్‌లో ఉంచడంలో, జీర్ణక్రియ సక్రమంగా పనిచేయడానికి ఫైబర్ కీలక పాత్ర పోషిస్తుంది. రోజూవారీ ప్రతిపాదించిన ఫైబర్ తీసుకోవడం వల్ల దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది, ఫైబర్స్ గట్ మైక్రోబయోటాను మీడియేట్ చేస్తుంది, జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. ఇందులో రకరకాలు ఉండొచ్చు గానీ ప్రధానమైనవి నీటిలో కరిగేది, నీటిలో కరగనిది. నీటిలో కరిగే పీచు మృదువుగా ఉంటుంది. నీటిని పీల్చుకోవటం ద్వారా ఇది మల పదార్థం ఏర్పడేలా, విసర్జన సాఫీగా సాగేలా చేస్తుంది. ఇది కూరగాయలు, విత్తనాలు, దంపుడు బియ్యం, బార్లీ, ఓట్స్ వంటి వాటితో లభిస్తుంది.






నీటిలో కరగని ఫైబర్ కాస్త గట్టిగా ఉంటుంది. లివర్ నుంచి పేగుల్లోకి వచ్చే కొలెస్ట్రాల్‌ను ఇది పట్టేసుకుంటుంది. ఇది విత్తనాలు, పండ్లు, పప్పుధాన్యాలతో లభిస్తుంది. ఫైబర్ రిచ్ ఫుడ్స్ మన డైట్‌లో తీసుకుంటే.. ఎలాంటి ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చో నిపుణులు చెబుతున్నారు. బరువు తగ్గుతారు.. ఫైబర్స్ మన శరీరంలోని గట్ బాక్టీరియాను ఆరోగ్యంగా ఉంచడానికి సహాయపడతాయి. ఫైబర్ రిచ్ డైట్ మన కడుపును ఎక్కువసేపు నిండుగా ఉంచుతుంది. త్వరగా ఆకలి వేయకుండా నియంత్రిస్తుంది.. తద్వారా అతిగా తినకుండా కంట్రోల్‌లో ఉంటాం. ఫైబర్ శరీరంలోని కొవ్వు త్వరగా కరగడానికి సహాయపడు తుంది, బెల్లీ ఫ్యాట్ తగ్గుతుంది. బ్లడ్ షుగర్ లెవల్స్ కంట్రోల్‌లో ఉంచుతుంది.. ఫైబర్ రిచ్ డైట్ బ్లడ్ షుగర్ లెవల్స్‌ను కంట్రోల్‌లో ఉంచుతుంది, ఎందుకంటే మానవ శరీరం ఫైబర్‌ను గ్రహించుకోలేదు, విచ్ఛిన్న చేయలేదు. ఇది కార్బోహైడ్రేట్ల కారణంగా.. రక్తంలో పెరిగే చక్కెర స్థాయిలను కంట్రోల్‌లో ఉంచుతుంది. ఆహారం త్వరగా జీర్ణం కాకుండా చూస్తూ రక్తంలోకి గ్లూకోజు నెమ్మదిగా వెళ్లేలా చేస్తుంది. వైద్యులు సాధారణంగా 18 సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు ఉన్నవారు ప్రతిరోజూ 22-35 గ్రాముల ఫైబర్ తీసుకోవాలని సిఫార్సు చేస్తారు.

గుండెకు మంచిది..

ఫైబర్ రిచ్ డైట్ గుండె పనితీరును మెరుగుపరుస్తుంది. నీటిలో కరగని ఫైబర్ . లివర్ నుంచి పేగుల్లోకి వచ్చే కొలెస్ట్రాల్‌ను ఇది పట్టేసుకుంటుంది. దీంతో రక్తంలో కొలెస్ట్రాల్ లెవల్స్ కంట్రోల్‌లో ఉంటాయి. కరగని ఫైబర్ ఎక్కువగా.. విత్తనాలు, పండ్లు, పప్పుధాన్యాలతో లభిస్తుంది. ఫైబర్ రిచ్ ఫుడ్స్ హైపర్‌టెన్షన్‌ను, శరీరంలోని ఇన్ఫ్లమేషన్‌ను కూడా కంట్రోల్‌లో ఉంచుతుంది.

క్యాన్సర్ రిస్క్ తగ్గిస్తుంది.. పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, చిక్కుళ్లలో లభించే ఫైబర్ కొన్ని రకాల క్యాన్సర్‌ల ప్రమాదాన్ని తగ్గిస్తాయని నిపుణులు అంటున్నారు. నీటిలో కరిగే పీచు మృదువుగా ఉంటుంది. నీటిని పీల్చుకోవటం ద్వారా ఇది మల పదార్థం ఏర్పడేలా, విసర్జన సాఫీగా సాగేలా చేస్తుంది. రెగ్యులర్ ప్రేగు కదలికలు సంభావ్య హానికరమైన పదార్థాలు పెద్దప్రేగు లైనింగ్‌తో సంబంధంలో ఉండే సమయాన్ని తగ్గిస్తాయి, ఇది కొలొరెక్టల్ క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఎంత తీసుకోవాలి.. ఫైబర్ అవసరం జీర్ణ వ్యవస్థ పరిమాణాన్ని బట్టి ఆధారపడి ఉంటుంది. పెద్దగా ఉంటే ఎక్కువ ఫైబర్ కావాలి. ఉదాహరణకు- 50 కిలోల బరువు ఉన్నవారికి రోజుకు 20-25 గ్రాములు అవసరం. అదే 75 కిలోల బరువుంటే సుమారు 30-35 గ్రాములు కావాలి.



ఒకప్పుడు బట్టలు టైట్‌గా ఉంటే ఫ్యాషన్. కానీ, ఎప్పటికప్పుడు ట్రెండ్స్ మారుతుంటాయి. కాబట్టి, ప్రజెంట్ కాస్తా లూజ్‌గా ఉండే డ్రెస్సెస్‌ని కూడా ట్రై చేస్తున్నారు. వదులైన బట్టలు వేసుకుంటే స్టైల్‌తో పాటు ఈ లాభాలు కూడా.. నిజానికి లూజ్‌గా ఉండే బట్టలు అంటే అంతగా ఇష్టపడరు. దీని వల్ల తమ లుక్స్ అతగా బాగోవని అనుకునేవారు. కానీ, ఇప్పుడు చాలా మంది కంఫర్ట్‌నెస్‌ని కోరుకుంటారు. సెలబ్రిటీలు సైతం వదులుగా ఉండే బట్టల్ని స్టైల్ చేసి పోజులివ్వడంతో చాలా మంది లూజ్‌గా ఉండే బట్టల్ని వేసుకుంటున్నారు. మీరు ఇందుకోసం మళ్ళీ షాపింగ్ చేయాల్సిన అవసరం లేదు. మీ ఇంట్లో వారి బట్టల్ని స్టైల్ చేయొచ్చు. అందుకోసం ఏ టిప్స్ పాటించాలో

# వదులైన బట్టలు వేసుకుంటే..






చూద్దాం. లూజ్ ప్యాంట్స్.. లూజ్ ప్యాంట్స్‌ని కాస్తా టైట్‌గా ఉండే టాప్స్, ఫన్నీ షర్ట్స్, క్రాప్ టాప్‌తో మ్యాచ్ చెయొచ్చు. అదే విధంగా.. లూజ్‌గా ఉన్న ప్యాంట్స్ వేసుకున్నప్పుడు వాటిపైకి షూస్ వేసుకుంటే మంచి లుక్ వస్తుంది.

కుర్తీ.. మీరు లూజ్‌గా ఉండే కుర్తీలు కూడా వేసుకోవచ్చు. ఈ కుర్తీని స్టైల్ చేసే ముందు మీకు సెట్ అవుతుందో లేదో తెలుసుకోండి. అదే విధంగా, కొన్ని మెటీరియల్స్ కుర్తీలు, కాటన్ కుర్తీలు అందరికీ సెట్ కాకపోవచ్చు. కాబట్టి, కుర్తీని సెలక్ట్ చేసేటప్పుడు కొన్ని జాగ్రత్తలు తీసుకోవచ్చు.

బీచ్ లుక్.. లూజ్‌గా ఉన్న డ్రెస్సెస్ మంచి బీచ్ లుక్‌ని కూడా ఇస్తాయి. ఇందుకోసం లూజ్ మ్యాక్సీ డ్రెస్ వేసుకోవచ్చు. పార్టీ లుక్ ఇవ్వడానికి బెల్ట్, బూట్స్‌తో దీనిని పేర్ అప్ చేయొచ్చు. అదే విధంగా, షార్ట్ ప్యాంట్, లూజ్ టీ షర్ట్స్, మినీ టిప్స్, షర్ట్స్ స్టైల్ చేయొచ్చు.

లూజ్ టీ షర్ట్.. లూజ్ టీ షర్ట్ ఎంత కంఫర్ట్‌గా ఉంటుందో అంతే ఫ్యాషన్‌గా కూడా కనిపిస్తుంది. వదులుగా ఉండే టీ షర్ట్స్ క్యాజువల్ లుక్‌ని ఇస్తుంది. వీటికి మ్యాచింగ్‌గా మీరు చక్కని షార్ట్స్ వేసుకోవచ్చు. బ్యాగీ ప్యాంట్స్‌కి కూడా బానే ఉంటాయి. కార్గో ప్యాంట్స్ కూడా చక్కని ఎలివేషన్‌ని ఇస్తాయి.


లూజ్ షర్ట్.. మీరు లూజ్‌గా ఉండే బట్టలు వేసుకోవాలంటే ముందుగా మీకు లూజ్ షర్ట్ ఉండాలి. అయితే, వాటిని మీరు వేసుకునేందుకు లోపలై సరైన ఇన్నర్స్ వేసుకోవాలి. అది మీ బాడీని మొత్తం కవర్ చేయాలి. తర్వాత ఈ షర్ట్‌ని స్కిన్నీ ఫిట్ జీన్స్, స్కర్ట్స్, ప్యాంట్స్‌తో పేర్ అప్ చేయొచ్చు. వీటిని ఎలివేట్ చేయాలంటే మంచి బెల్ట్, బూట్స్ వేసుకోండి. మీరు లూజ్‌గా ఉండే బట్టలు వేసుకున్నప్పుడు కొన్ని విషయాలను గుర్తుపెట్టుకోవాలి. మంచి కలర్ కాంబినేషన్స్ ఫాలో అవ్వాలి. ఎంచుకున్న డ్రెస్సెస్‌కి సరిపోయే షూ, యాక్సెసరీస్ తీసుకోవాలి. మేకప్ కూడా డీసెంట్‌గా ఉండాలి.

లూజ్ బట్టలతో లాభాలు.. టైట్‌గా ఉండే డ్రెస్సెస్ కంటే లూజ్‌గా ఉండే బట్టలు వేస్తే చర్మ సమస్యలు రావు. చర్మానికి వెంటిలేషన్ అందుతుంది. చెమట ఎక్కువగా రాదు. దీంతో చెమట వాసన రాదు. ఇబ్బంది కూడా ఉండదు.

# పెళ్ళికి ముందు ఈ పనులు చేయాల్సిందే..





పెళ్ళి అనేది ప్రతి ఒక్కరి జీవితంలో చాలా ముఖ్యం. ఈ ఘట్టం ముందు కొన్ని పనులు చేయడం చాలా ముఖ్యం. అవేంటో తెలుసుకోండి.

ప్రతి జీవితంలోనూ ఒకరు తోడుగా ఉండడం చాలా ముఖ్యం. అప్పుడే జీవితం ఆనందమయమవుతుంది. అందుకే ఓ వయసు వచ్చాక తల్లీదండ్రులు పిల్లలకి పెళ్ళిళ్ళు చేసేస్తారు. అయితే, పెళ్ళి చేసే ముందు కొన్ని పనులు తప్పకుండా చేయడం మంచిది. అలాంటి పనులతో జీవితాన్ని హ్యాపీగా ఆస్వాదించొచ్చు. అవేంటో తెలుసుకోండి.

సెల్ఫ్ లవ్.. మిమ్మల్ని మీరు ఎంత లవ్ చేసుకుంటారో మీ చుట్టూ ఉన్నవారు కూడా మిమ్మల్ని అంత లవ్ చేస్తారు. కాబట్టి, ఎక్కువగా మిమ్మల్ని మీరు ప్రేమించుకునేలా చూడండి. అడ్వెంచర్స్.. లైఫ్‌లో ప్రతి ఒక్క విషయాన్ని ఆస్వాదించాలి. అందుకోసం మీరు మీ కంఫర్ట్ జోన్‌లోనే వీలైనన్నీ అడ్వెంచర్స్ చేయడం చాలా ముఖ్యం. అందుకే అడ్వెంచర్స్ చేసేయండి. డబ్బు.. అదే విధంగా మ్యారేజ్‌కి ముందు మీకంటూ కొద్దిగా మనీ సేవ్ చేసుకోవడం చాలా ముఖ్యం. సెల్ఫ్ ఇండిపెండెంట్‌గా ఉండేందుకు జాబ్, బిజినెస్ చేయడం చాలా ముఖ్యం. దీని వల్ల మీకంటూ కాస్తా డబ్బు ఉంటుంది.

సామాజిక సేవ.. వీలైనంత వరకూ కొద్దిగానైనా సాజిక సేవకి టైమ్ కేటాయించండి. దీని కోసం మీరు వాలంటీర్‌గా కూడా పనిచేయొచ్చు. అది ఏ రూపంగా అయినా సరే సామాజిక సేవ చేయడం ముఖ్యమని గుర్తుపెట్టుకోండి. టైమ్ స్పెండ్.. అదే విధంగా, స్నేహితులు, బంధువులతో వీలైనంతత వరకూ ఎక్కువ సమయాన్ని గడపండి. వీలైతే మ్యారేజ్ అయ్యాక కూడా ఈ రిలేషన్‌ని కంటిన్యూ చేయండి. దీని వల్ల మీ రిలేషన్ గ్యాప్ రాకుండా ఉంటుంది. ఇష్టపడే పనులు.. అదే విధంగా, మీకు ఇష్టమైన పనులు చేయండి. దీని వల్ల ప్రతి దాన్ని ఆస్వాదించిన వారవుతారు. అదే విధంగా ఏదైనా నేర్చుకోవడానికి ట్రై చేయండి. చాలా కళలు ఉన్నాయి. కొత్త విషయాలు నేర్చుకోండి. ఇవి జీవితంలో ఏదైనా టైమ్‌లో హెల్ప్ అవుతాయి. హెల్త్.. ఈ టైమ్‌లో మీ హెల్త్‌పై కూడా కేర్ తీసుకోండి. మానసిక, శారీరకంగా ఎలాంటి సమస్యలు లేకుండా చూసుకోండి. మంచి హెల్దీ ఫుడ్ తీసుకోండి. రెగ్యులర్‌గా వర్కౌట్ చేయండి. హ్యాపీగా నిద్రపోండి. సింగిల్ జర్నీ.. జీవితంలో ఒంటరిగా ప్రయాణించడం అనేది ప్రతి ఒక్కరూ కూడా ఎక్స్‌పీరియెన్స్ చేయాలి. దీని వల్ల ఎలాంటి పరిస్థితినైనా ఒంటరిగా ఎదుర్కొనే శక్తి మీకు అందిస్తాయి. అందుకే కచ్చితంగా ఒంటరిగా ప్రయాణాలు చేసి చూడండి. అదే చాలా వరకూ హ్యాపీనెస్ ఇస్తుంది.

# విశేషంగా





మహేశ్ బాబు హీరోగా రాజమౌళి తెరకెక్కిస్తోన్న 'వారణాసి' 2027 ఏప్రిల్ 7న రిలీజ్ కానుంది. అంటే ఇంకా సంవత్సరం పైగా ఉంది. ఈ సినిమా ప్రస్తుతం జార్జియాలో షూటింగ్ జరుపుకుంటోంది. ఈ యేడాది డిసెంబర్ లోగా 'వారణాసి' షూటింగ్ పార్ట్ పూర్తవుతుందని తెలుస్తోంది. తరువాత ఆ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ తో సాగుతుంది. మరి మహేశ్ బాబు తరువాత ఏ సినిమాలో నటించడానికి అంగీకరించారు అన్న అంశంపై ఫ్యాన్స్ తో పాటు సినీ లవర్స్ సైతం చర్చించుకుంటున్నారు. మహేశ్ తో సినిమా రూపొందించడానికి తెలుగు దర్శకులతో పాటు పలువురు పరభాషా డైరెక్టర్స్ సైతం ఆసక్తిగా ఉన్నారు. అయితే మహేశ్ మాత్రం మన తెలుగు డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు ఓ వార్త విశేషంగా వినిపిస్తోంది. సందీప్ తెలుగువారైనా బాలీవుడ్ లోనూ తన సత్తా చాటుకుంటున్నారు. ప్రస్తుతం ప్రభాస్ హీరోగా సందీప్ రెడ్డి 'స్పిరిట్' అనే మూవీని రూపొందిస్తున్నారు. ఆ సినిమా కూడా వచ్చే యేడాది వెలుగు చూడనుంది. ఈ నేపథ్యంలో ఇటు మహేశ్, అటు సందీప్ ఇద్దరూ ఫ్రీ అవుతారు కాబట్టి వారి కాంబినేషన్ లోనే సినిమా ఉంటుందని పరిశీలకులు చెబుతున్నారు. మహేశ్ తో సందీప్ సినిమా అనగానే ఫ్యాన్స్ లోనూ అమితాసక్తి కలుగుతోంది.

# లోక 2 సీక్వెల్..



గతేడాది మలయాళ చిత్రసీమలో సంచలన విజయాన్ని నమోదు చేసిన చిత్రం 'లోక చాప్టర్ 1: చంద్ర'. 'లోక' సినిమాటిక్ యూనివర్స్‌లో తొలి చిత్రంగా వచ్చిన ఈ ఫాంటసీ సూపర్ ఉమెన్ డ్రామా, విడుదలైన తొలి రోజే పాజిటివ్ టాక్ తెచ్చుకుని బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టించింది. వేఫేరర్ ఫిల్మ్స్ బ్యానర్‌పై దుల్కర్ సల్మాన్ నిర్మించిన ఈ చిత్రానికి డొమినిక్ అరుణ్ దర్శకత్వం వహించారు. కల్యాణి ప్రియదర్శన్ 'చంద్ర' పాత్రలో మెరిసింది. నస్లెన్, టొవినో థామస్, సౌబిన్ షాహిర్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించారు. విడుదలైన మూడు రోజుల్లోనే మలయాళంలో రూ.42 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించిన ఈ చిత్రం, ప్రపంచవ్యాప్తంగా సుమారు రూ.300 కోట్ల మార్క్‌ను అందుకుని మలయాళ ఇండస్ట్రీలోనే అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా నిలిచింది. ఇండియాలో తొలి సూపర్ ఉమెన్ కాన్సెప్ట్‌తో వచ్చిన ఈ సినిమా కమర్షియల్ ఎలిమెంట్స్‌తో పాటు భావోద్వేగాలను సమతూకంగా చూపించి ప్రేక్షకులను ఆకట్టుకుంది. ముఖ్యంగా 'చంద్ర' పాత్రలో కల్యాణి ప్రియదర్శన్ చూపించిన యాక్షన్, ఎమోషన్, స్క్రీన్ ప్రెజెన్స్ సినిమాకు ప్రధాన బలం అయ్యాయి. తాజాగా ఓ కార్యక్రమంలో పాల్గొన్న కల్యాణి ఈ చిత్ర సీక్వెల్‌పై ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ప్రస్తుతం ' లోక 2 ' స్క్రిప్ట్ పనులు కొనసాగుతున్నాయని, సెప్టెంబర్ నుంచి షూటింగ్ ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయని తెలిపింది. తాను కూడా ఈ ప్రాజెక్ట్‌లో భాగమై మళ్లీ 'చంద్ర' పాత్రనే పోషిస్తున్నానని స్పష్టం చేసింది.

# మళ్లీ తెరపైకి



ఒకప్పుడు తమ నటనతో తెలుగు ప్రేక్షకులను ఎంతగానో అలరించిన నటుడు శివాజీ, లయల జోడీ చాలా కాలం తర్వాత మళ్లీ వెండితెరపై సందడి చేయబోతోంది. వీరిద్దరూ ప్రధాన పాత్రలలో నటిస్తున్న కొత్త చిత్రం 'సాంప్రదాయిని సుప్పినీ సుద్దపూసని'. ఈ సినిమా మార్చి 6న థియేటర్లలో విడుదల కానున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ట్రైలర్ సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. కుటుంబం, పరిస్థితులు, నేరం, ఇన్వెస్టిగేషన్ అనే అంశాలతో సినిమా గ్రిప్పింగ్‌గా సాగుతుందని మేకర్స్ తెలిపారు. ఆద్యంతం వినోదంతో పాటు ఉత్కంఠను కూడా పంచేలా ఈ చిత్రం ఉండబోతోందని స్పష్టమవుతోంది. ఈ సినిమాకు మరో ప్రత్యేకత ఏమిటంటే, నటుడు శివాజీనే స్వయంగా నిర్మాతగా వ్యవహరించడం. శ్రీ శివాజీ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ఆయనే ఈ చిత్రాన్ని నిర్మించారు. సుధీర్ శ్రీరామ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో అలీ, ధన్‌రాజ్, ప్రిన్స్, జబర్దస్త్ ఇమ్మాన్యుయేల్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. రంజిన్ రాజ్ సంగీతం అందిస్తున్నారు. చాలా ఏళ్ల తర్వాత శివాజీ–లయల కాంబినేషన్‌లో వస్తున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో మంచి అంచనాలు నెలకొన్నాయి.

# మాస్ వార్నింగ్




టాలీవుడ్ యంగ్ హీరో విశ్వక్ సేన్ కెరీర్ ప్రారంభం నుంచీ వైవిధ్యమైన చిత్రాల్లో నటిస్తూ, తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. యూత్ లో మంచి ఫాలోయింగ్ క్రియేట్ చేసుకున్నారు. ఓవైపు హీరోగా నటిస్తూనే, మరోవైపు డైరెక్షన్ కూడా చేస్తున్నారు. ఆయన స్వీయ దర్శకత్వంలో ప్రస్తుతం 'కల్ట్' అనే సినిమా తెరకెక్కుతోంది. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన అప్డేట్ అందించారు

విశ్వక్ సేన్ ఇంతకముందు తాను హీరోగా నటిస్తూ 'ఫలక్‌నుమా దాస్', 'దాస్ కా దమ్కీ' వంటి సినిమాలకు దర్శకత్వం వహించారు. ఈ క్రమంలో గతేడాది 'కల్ట్' మూవీని అనౌన్స్ చేశారు. గ్రాండ్ గా టైటిల్ పోస్టర్ లాంచ్ చేశారు. దీన్ని తెలుగు, హిందీతో పాటుగా ఇంగ్లీష్, జపనీస్, స్పానిష్ వంటి అంతర్జాతీయ భాషల్లోనూ రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించారు. ఆ తర్వాత ఈ చిత్రానికి సంబంధించి ఎలాంటి అప్డేట్ బయటకు రాలేదు. ఉన్నట్టుండి ఈ మూవీ టీజర్ రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ వెల్లడించారు.

'కల్ట్' మూవీ టీజర్‌ను 2026 ఫిబ్రవరి 21న విడుదల చేయబోతున్నట్లు విశ్వక్ సేన్ సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు. "వార్నింగ్: మోస్ట్ వైలెన్స్ జరగబోతోంది. అదే రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి టీజర్ లాంచ్ ఈవెంట్ నిర్వహిస్తున్నాం" అని తెలిపారు. 'కల్ట్' అనేది ఇండియన్ సినిమాలో తీవ్రమైన హింసతో కూడిన ఫస్ట్ స్లాషర్ అని, ఈ చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వ బాధ్యతలు చేపట్టానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఓ ఇంట్రెస్టింగ్ పోస్టర్ ను షేర్ చేసుకున్నారు.

'కల్ట్' టీజర్ అనౌన్స్ మెంట్ పోస్టర్‌లో విశ్వక్ సేన్ సూటు బూటు వేసుకొని, స్టైల్ గా సిగరెట్ తాగుతూ.. చేతిలో ఒక పెద్ద గొడ్డలి పట్టుకొని కనిపిస్తున్నాడు. ఏరులై పారుతున్న రక్తాన్ని చూస్తుంటే, ఇందులో హింస ఏ రేంజ్ లో ఉంటుందో అర్థమవుతోంది. అందుకేనేమో "ఇది బొమ్మ కాదు. జోక్ కాదు. పిల్లల కోసం అసలే కాదు" అని విశ్వక్ సేన్ హెచ్చరిస్తున్నాడు. అది ఎలాంటి కల్ట్ కంటెంట్ అనేది టీజర్ వచ్చిన తర్వాత అందరికీ క్లారిటీ వచ్చే అవకాశం ఉంది.

# ఎమోషనల్



మూవీ మొఘల్ డి.రామానాయుడు మనవడిగా సినీ రంగంలోకి ఎంట్రీ ఇచ్చి ' బాహుబలి : ది బిగినింగ్', 'బాహుబలి 2: ది కన్‌క్లూజన్' చిత్రాలతో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారు రానా దగ్గుబాటి . 'బాహుబలి' సిరీస్‌లో పోషించిన 'భల్లాలదేవ' పాత్రతో రానా భారీ క్రేజ్‌ను సొంతం చేసుకున్నారు. ఆ పాత్ర కోసం ఆయన శారీరకంగా పడిన కష్టం, బాడీ ట్రాన్స్‌ఫర్మేషన్ గురించి అప్పట్లో విస్తృతంగా చర్చ జరిగింది. అందులో విలన్‌గా నటించినప్పటికీ హీరోకి ఏమాత్రం తగ్గకుండా తనదైన ముద్ర వేసిన రానా, ఆ తర్వాతి కాలంలో అనేక విభిన్న పాత్రలను ఎంచుకుంటూ ముందుకు సాగారు. అయితే 'బాహుబలి' విజయానంతరం ఆయన వ్యక్తిగత జీవితంలో ఎదురైన ఆరోగ్య సమస్యలు మాత్రం అభిమానులను షాక్‌కు గురి చేశాయి. తాజాగా ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో రానా తన అనారోగ్య సమస్యల గురించి మనసు విప్పి మాట్లాడారు. కిడ్నీ సమస్యలు తీవ్రరూపం దాల్చడంతో శస్త్రచికిత్స కోసం అమెరికా వెళ్లాల్సి వచ్చిందని. ఆ సమయంలో తన ముందున్న ఏకైక లక్ష్యం 'బతకడం' మాత్రమేనని, సినిమా కెరీర్ లేదా ఇమేజ్ గురించి ఆలోచించే స్థితిలో తాను లేనని పేర్కొన్నారు. దాదాపు ఏడాది పాటు చికిత్స తీసుకున్నాక భారత్‌కు తిరిగి వచ్చేటప్పుడు తన శరీరంలో వచ్చిన మార్పులు చూసి తానే ఆశ్చర్యపోయానని తెలిపారు. అద్దంలో చూసుకుంటే తనను తాను గుర్తుపట్టలేనంతగా కృశించిపోయానని ఆవేదన వ్యక్తం చేశారు. అనారోగ్య సమయంలో తన మానసిక స్థితి కూడా పూర్తిగా మారిపోయిందని రానా వెల్లడించారు. ఈ సందర్భంగా వరుణ్ తేజ్ గురించి చేసిన వ్యాఖ్యలు కూడా సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. అనారోగ్య సమయంలో వరుణ్ తనను పరామర్శించడానికి వచ్చాడని గుర్తుచేసుకున్న రానా, "అతడిని చూస్తుంటే పాత రానా కనిపించినట్లు అనిపించింది. నేను ఉండాల్సిన రూపంలో అతడు ఉన్నాడు. నా కథలన్నీ అతడికే ఇచ్చేయాలా? అని కూడా ఒక క్షణం అనిపించింది" అంటూ భావోద్వేగానికి లోనయ్యారు. తనలో వచ్చిన మార్పును వరుణ్‌లో చూసుకున్నానని ఆయన చెప్పిన మాటలు అభిమానులను కదిలించాయి.అమెరికా నుంచి భారత్‌కు తిరిగి వస్తున్న సమయంలో ఓ ఇమిగ్రేషన్ అధికారి తనను 'కింగ్ భల్లాలదేవ' అని పిలవడం తనకు మళ్లీ ఆ పాతరోజుల్ని గుర్తు చేసిందని రానా ఆనందంగా వివరించారు. అనారోగ్య పోరాటం తనలో మానసిక దృఢత్వాన్ని పెంచిందని, ఆరోగ్యం కంటే గొప్పది ఏదీ లేదని స్పష్టం చేశారు. ప్రస్తుతం రానా నటుడిగానే కాకుండా నిర్మాతగా కూడా బిజీగా ఉన్నారు. వివిధ చిత్రాల్లో అతిథి పాత్రలు పోషిస్తూ, కొత్త ప్రాజెక్టులతో ముందుకు సాగుతున్నారు. అలాగే ఓ టాక్ షో ద్వారా బుల్లితెర ప్రేక్షకులను అలరిస్తున్నారు.

# ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్‌గా

'రెక్కీ', 'విరాటపాలెం' మేకర్స్ నుంచి రాబోతోన్న మరో ఇన్వెస్టిగేటివ్ క్రైమ్ థ్రిల్లర్ ' డాటర్ ఆఫ్ ప్రసాద్ రావు '. 'కనబడుటలేదు' అనేది దీనికి ట్యాగ్ లైన్. ఇందులో రాజీవ్ కనకాల, ఉదయభాను, వాసంతిక, శ్రీరామ్ వెంకట్ ప్రధాన పాత్రల్లో నటించారు. గాయత్రి భార్గవి, హిమ బిందు ఇతర పాత్రలు పోషించారు. కృష్ణ పోలూరు దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని సౌత్ ఇండియా స్క్రీన్స్ బ్యానర్ మీద కె.వి. శ్రీరామ్ నిర్మించారు. ప్రమోషన్స్‌లో భాగంగా తాజాగా మూవీ ట్రైలర్‌ను లాంచ్ చేశారు. 'అమ్మికి ఏమైందో అని భయంగా ఉంది రమేషా' అనే డైలాగ్‌తో ప్రారంభమైన 'డాటర్ ఆఫ్ ప్రసాద్ రావు' ట్రైలర్ ఆద్యంతం ఉత్కంఠను రేకెత్తించేలా సాగింది. జాబ్ కోసం హైదరాబాద్ వచ్చిన స్వాతి అనే అమ్మాయి మిస్సవ్వడం, ఆమెను వెతకడానికి పోలీసులు రంగంలోకి దిగడం, ఇన్వెస్టిగేషన్ సాగే క్రమంలో ఎదురయ్యే ట్విస్టులు, మిస్సయిన కూతురి కోసం ఓ తండ్రి పడే వేదన.. ఈ ట్రైలర్ లో చూపించారు. ఓవైపు తండ్రీకూతుళ్ల మధ్య ప్రేమను ఆవిష్కరిస్తూనే.. మరోవైపు ఇన్వెస్టిగేటివ్ ఎలా సాగిందనేది ఉత్కంఠభరితంగా చూపించారు.

'డాటర్ ఆఫ్ ప్రసాద్ రావు' సినిమాలో రాజీవ్ కనకాల, వాసంతిక తండ్రీకూతురుగా కనిపించారు. రెబెకా జోసెఫ్ అనే పవర్ ఫుల్ ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ పాత్రలో యాంకర్ ఉదయ భాను నటించింది. 'కళ్ల ముందే ఏదో ఉంది.. కానీ ఏదో మిస్ అవుతున్నాను.. ఏం మిస్ అవుతున్నాను' అంటూ ఆమె చెప్పే డైలాగ్స్‌తో సినిమాలో చాలానే ట్విస్టులు ఉన్నాయని అర్థమవుతోంది. అసలు స్వాతి ఎలా మిస్ అయింది? దీని వెనుకున్నది ఎవరు? హాస్టల్‌లో స్నేహితులు కారణమా? ఆఫీసులో కొలీగ్స్ కారణమా? ఈ కేసులో తండ్రి పాత్ర ఏంటి? అనే పలు రకాల ప్రశ్నల్ని లేవనెత్తేలా ఈ ట్రైలర్‌ను కట్ చేశారు.



# ఎంటర్‌టైనర్‌గా

ఔట్ అండ్ ఔట్ యాక్షన్ ఎంటర్టైనర్‌గా తెరకెక్కుతున్న ' మిరాకిల్ ' మూవీ టాలీవుడ్‌లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ప్రభాస్ నిమ్మల దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాను సైదా ఫ్యామిలీ ఎంటర్టైన్మెంట్ బ్యానర్‌పై రమేష్ ఎగ్గిడి, శ్రీకాంత్ మొగదాసు, చందర్ గౌడ్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇప్పటికే 'సత్య గ్యాంగ్', 'ఫైటర్ శివ' చిత్రాలతో దర్శకుడిగా తనదైన ముద్ర వేసుకున్న ప్రభాస్ నిమ్మల ఈ ప్రాజెక్ట్‌తో మరో కమర్షియల్ హిట్ లక్ష్యంగా ముందుకెళ్తున్నారు. రణధీర్ భీసు హీరోగా నటిస్తుండగా, సీనియర్ హీరోలు శ్రీరామ్, సురేష్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. సంక్రాంతి సందర్భంగా జనవరి 16న విడుదల చేసిన ఫస్ట్‌లుక్‌కి మంచి రెస్పాన్స్ వచ్చింది.

ఈ మూవీ ద్వారా నాయుడు పెంద్ర విలన్‌గా పరిచయమవుతుండగా, సీనియర్ ఫిల్మ్ జర్నలిస్ట్ ధీరజ్ అప్పాజీ ఫోరెన్సిక్ ఆఫీసర్ పాత్రలో కనిపించనున్నారు. జనార్దన్, యోగి కాత్రే, విజయ్ సూర్య, ఇంతియాజ్, సాయిబాబా, దిల్ రమేష్, ఝాన్సీ, సూర్యనారాయణ, శ్రీధర్, శ్రీకాంత్, శివ, ఆమని, హైమావతి, నవ్య (అమ్ము), సమీర్ దత్తా, అనుశ్రీ, బెజవాడ మస్తాన్, ఆర్. కుమార్ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్నారు. టెక్నికల్ టీమ్ విషయానికి వస్తే, సురేందర్ రెడ్డి సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, విశ్వనాథ్ ఎడిటింగ్ బాధ్యతలు చేపట్టారు. రాంబాబు గోసాల సాహిత్యం అందిస్తుండగా, శ్రీను ఫైట్స్‌ను డిజైన్ చేస్తున్నారు. కథ, మాటలు, స్క్రీన్‌ప్లే, సంగీతం, దర్శకత్వం అన్నీ ప్రభాస్ నిమ్మలే నిర్వహించడం ఈ చిత్రానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.

ఇప్పటికే రెండు షెడ్యూల్స్ విజయవంతంగా పూర్తి చేసుకున్న 'మిరాకిల్' టీమ్ మూడో షెడ్యూల్‌కు సిద్ధమవుతోంది. ఇదే సమయంలో హీరోయిన్ హెబ్బా పటేల్ ఈ ప్రాజెక్ట్‌లో చేరడం సినిమాపై మరింత హైప్‌ను పెంచింది. గ్లామర్‌తో పాటు పెర్ఫార్మెన్స్‌కు ప్రాధాన్యం ఉన్న పాత్రలో ఆమె కనిపించబోతున్నట్లు యూనిట్ వర్గాలు చెబుతున్నాయి. ఫిబ్రవరి 24 నుంచి హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో జరిగే మూడో షెడ్యూల్‌లో హెబ్బా పటేల్ షూటింగ్‌లో పాల్గొననుందని మేకర్స్ తెలిపారు. దర్శకుడు ప్రభాస్ నిమ్మల ఈ చిత్రాన్ని కమర్షియల్ ఎలిమెంట్స్‌తో పాటు స్ట్రాంగ్ యాక్షన్ బ్లాక్స్‌తో రూపొందిస్తున్నారని నిర్మాతలు వెల్లడించారు. హెబ్బా పటేల్ గ్లామర్, శ్రీరామ్, సురేష్ కీలక పాత్రలు, హై వోల్టేజ్ యాక్షన్ సన్నివేశాలు 'మిరాకిల్' చిత్రానికి హైలైట్స్‌గా నిలుస్తాయని పేర్కొన్నారు. టైటిల్‌కు తగ్గట్టే ప్రేక్షకులకు ఒక మాస్ ఎంటర్టైనింగ్ అనుభూతి ఇవ్వాలనే లక్ష్యంతో చిత్రాన్ని రూపొందిస్తున్నామని చెప్పారు.



Uttejitha:-Printed,editor,Pablished And owned By M.chandrasek her.46-801u2.Budhawerpeta.kurnool.andrapradesh.pin 518002.printed At Uttejitha -Printers.Kurnool.Ap.cell 9440140418. RNI ApTEEL2008/24570.